నేడు సామాజిక పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): వివిధ కేటగిరీలకు సంబంధించిన సామాజిక పింఛన్లను శనివారం జిల్లాలో పంపిణీ చేయనున్నారు. జూన్ ఒకటి ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,59,085 మందికి రూ.69.62 కోట్ల పంపిణీకి సంబంధించి గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి సొమ్ము అందజేశారు. 4 గ్రామీణ మండలాల్లో 26,348 మంది పింఛన్‌దారులకు రూ.11.06 కోట్లు, జీవీఎంసీ పరిధిలో 1,32,737మందికి రూ.58.56 కోట్లను విడుదల చేశారు.

నగరంలో తృప్తి క్యాంటీన్లు

స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోభివృద్ధికి జీవీఎంసీ నిర్ణయం

- 6న జరగనున్న కౌన్సిల్ సమావేశానికి 27 అంశాలతో అజెండా
- మరికొన్ని అంశాలను చేర్చాలని పలువురు కార్పొరేటర్ల పట్టు



విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'తృప్తి' క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోభివృద్ధి, మహిళలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో జీవీఎంసీ యూసీడీ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

జవన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద సారా ప్రాజెక్టు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించిన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతానికి మూడుచోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించడంతో పైలట్ ప్రాజెక్టుగా వీటిని ప్రారంభించే అవకాశం ఉంది. దీనిపై జూన్ 6న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపేందుకు వీలుగా అజెండాలో చేర్చారు. కౌన్సిల్ సమావేశానికి అధికారులు 27 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు. అయితే ఇందులో మరికొన్ని అంశాలను చేర్చాలంటూ పలువురు కార్పొరేటర్లు మేయర్ పీలా శ్రీనివాసరావు, గ్రేటర్ కార్యదర్శి బీవీ రమణను కలిసి పట్టుబడుతున్నారు.

జీవీఎంసీ కౌన్సిల్ సాధారణ సమావేశం గత ఏడాది డిసెంబరులో జరిగింది. ఆ తరువాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం, కొత్త మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక కారణంగా ఇప్పటివరకు కౌన్సిల్ సమావేశం జరగలేదు. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికైన తరువాత ఇదే తొలి కౌన్సిల్ సమావేశం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. జూన్ 6న జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా అధికారులు, కార్పొరేటర్లు అనేక పనులకు సంబంధించిన అంశాలను అజెండాలో చేర్చాలంటూ మేయర్ పీలా, ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రాలను అందజేశారు. దీంతో అజెండాలో వందకుపైగా అంశాలు ఉండవచ్చని అందరూ భావించారు. కానీ అజెండా కూర్పుపై మేయర్, జీవీఎంసీ కార్యదర్శి, కొందరు అధికారులు కార్పొరేటర్లతో చర్చించారు. అనంతరం 27 అంశాలను మాత్రమే అజెండాలో చేర్చాలని నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా మలేరియా సీజనల్ కార్మికుల నియామకం, పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికుల సేవల పొడిగింపు, 76వ వార్డులో రూ.1.96 కోట్లతో డ్రెయిన్ నిర్మాణం, 97వ వార్డులో రూ.1.85 కోట్లతో థీమ్ పార్కుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, 87వ వార్డు పరిధి కూర్మన్నపాలెం ఎంవీవీ-ఎంకే అపార్టుమెంట్‌కు 150 కేఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడానికి రూ.1.21 కోట్లతో పైపు లైన్ నిర్మాణం, 18వ వార్డు పరిధి అప్పూఘర్‌లో రూ.66.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్థు నిర్మాణం వంటి అంశాలు ఉన్నాయి.

కాగా జనసేన పార్టీకి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తాను కౌన్సిల్‌లో చర్చించేందుకు వీలుగా పది అంశాలను అజెండాలో చేర్చాలని కోరితే, వాటిని చేర్చకపోవడంతో తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాల టెండర్లు, రాత్రి ఫుడ్ కోర్టు, టీడీఆర్ కుంభకోణం, పార్కులు, జీవీఎంసీ ఆస్తులు, జీ-20 పనులు వంటి అంశాలపై చర్చించాలని కోరుతూ మేయర్, గ్రేటర్ కార్యదర్శితోపాటు ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తే, కనీసం వాటిని పట్టించుకోక పోవడానికి కారణమేమిటని కార్యదర్శిని ఆయన నిలదీశారు. తాను ... మిగతా 4వ పేజీలో

సమ్మెపై చర్చలకు ఉక్కు యాజమాన్యం డుమ్మా

- తీరిక లేదని, ఎవరూ హాజరు కాలేమని ఆర్‌ఎల్‌సీకి లేఖ
- తీవ్ర నిరాశకు గురైన కాంట్రాక్టు కార్మికులు
- ప్రజాప్రతినిధులను కలవాలని నిర్ణయం
- 10న మరోసారి చర్చలు: ఆర్‌ఎల్‌సీ

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ)తో శుక్రవారం నగరంలో జరగాల్సిన చర్చలకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం డుమ్మా కొట్టింది.



ఇంతకుముందు జరిగిన సమావేశానికి కూడా కేవలం మేనేజర్ స్థాయి అధికారిని పంపించి, చర్చలపై ఆసక్తి లేదన్నట్టుగా యాజమాన్యం వ్యవహరించింది. ఈసారి చర్చలకు ఉన్నత స్థాయి అధికారిని పంపాలని రీజనల్ లేబర్ కమిషనర్ సూచించగా, అసలు హాజరు కావడానికే తీరిక లేదంటూ శుక్రవారం లేఖ పంపింది. వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ వారంతా ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ముందుగానే నోటీసు ఇచ్చారు. అయినా ఉక్కు యాజమాన్యం స్పందించలేదు. పైగా విధులకు హాజరు కావడం లేదంటూ మరో రెండు వేల మంది గేట్ పాసులను నిలిపివేయడంతో కార్మికులు సమ్మెను ఉధృతం చేశారు. అయితే 13 వేల మంది కాంట్రాక్టు కార్మికుల్లో దాదాపుగా ఎనిమిది వేల మంది వరకు విధులకు హాజరవుతున్నారు. తొలగించిన కార్మికులు, వారికి మద్దతుగా మరికొందరు మాత్రమే సమ్మె చేస్తున్నారు. సమ్మె విరమణ కోసం వారితో చర్చలు జరిపేందుకు యాజమాన్యం ముందుకు రావడం లేదు. ఈ నెల 20వ తేదీ వరకు ఎవరినీ తొలగించబోమని హామీ ఇచ్చి, ఆ గడువు దాటిన తరువాత మరికొంతమందిని ఆపేసింది. ఇక వారి అవసరం లేదన్నట్టుగానే వ్యవహరిస్తోంది. నిబంధనల ప్రకారం సమస్య పరిష్కారానికి ఆర్‌ఎల్‌సీ చర్చలకు ఆహ్వానించగా.. దానికి కూడా ప్లాంట్ యాజమాన్యం స్పందించడం లేదు. కాంట్రాక్టు కార్మికుల ... మిగతా 4వ పేజీలో

బైకుతో పూలకుండీని ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

- 6లో



తాటిచెట్లపాలెం కూడలిలో వర్షం కురుస్తున్న దృశ్యం

కుమ్మేసిన వాన

నగరంలో ఈదురుగాలులు, పిడుగులు

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనచోదకులు
- గంభీరంలో 41.5 మి.మీ. వర్షపాతం నమోదు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన మహా నగరంలో శుక్రవారం మధ్యాహ్నం తరువాత జోరువాన కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షానికి నగరంలోని అనేక ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తింది. ఈదురుగాలులు, పిడుగులతో కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. ఆరుబయట ఉన్నవారంతా తడిసి ముద్దయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగింది. దీంతో సముద్రం నుంచి తేమగాలులు వీయడంతో దట్టంగా మేఘాలు నగరంపై కమ్మేశాయి. ఈ ప్రభావంతో ఈదురుగాలులు, పిడుగులు సంభవించడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దాదాపు గంటన్నరపాటు కురిసింది.



జ్ఞానాపురం బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాలు మొరాయించడంతో పాట్లు

నగరంతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు చేరింది. పూర్ణామార్కెట్, బీచ్ రోడ్డు, వన్‌టౌన్ కొత్త రోడ్డు, రామకృష్ణా బజార్, మునిసిపల్ స్టేడియం, రైల్వే స్టేషన్, జ్ఞానాపురం, రైల్వే న్యూకాలనీ, ఇసుకతోట, మద్దిలపాలెం, హనుమంతవాక, హెచ్‌బీ కాలనీ, తదితర ప్రాంతాల్లోని రహదారులపై పెద్దఎత్తున నీరు చేరడంతో చెరువులను తలపించాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు నానాపాట్లు పడ్డారు. జ్ఞానాపురం రైల్వే బ్రిడ్జి కింద రెండు అడుగుల వరకు నీరు నిలిచిపోవడంతో పలువురి ద్విచక్ర వాహనాలు మొరాయించాయి. దీంతో వారు తమ వాహనాలను తోసుకుంటూ ముందుకు సాగారు. వర్ష తీవ్రతకు డ్రైనేజీలు, గెడ్డలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల రోడ్లపైకి చెత్తాచెదారం, ప్లాస్టిక్ సామగ్రి పేరుకుపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందరు ఇక్కట్లకు గురయ్యారు. సాయంత్రం పూట ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగించే వారికి వర్షం అడ్డంకిగా మారింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు గంభీరంలో 41.5 మిల్లీమీటర్లు, ఆరిలోవలో 40.5, సీతమ్మధారలో 38.75, పెదజాలారిపేటలో 38.5, శిల్పారామం జాతర వద్ద 36.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మరిన్ని ఫొటోలు 6వ పేజీలో

విద్యుత్ సరఫరా మెరుగుకు కసరత్తు

ఎక్కడికక్కడే ఫీడర్ల విభజన

- కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణం
- జూన్ నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి ఈపీడీసీఎల్ అధికారుల ప్రణాళిక



ఎలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యుత్ సరఫరా మెరుగుకు ఈపీడీసీఎల్ అధికారులు విస్తృతంగా పనులు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద నిధులు మంజూరు చేయడంతో గడువులోగా ఆయా పనులను పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఎక్కడైతే విద్యుత్ లోడ్ అధికంగా పడుతుందో గుర్తించి ఆయా ఫీడర్లపై భారాన్ని తగ్గించి కొత్త ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నారు. భీమునిపట్నం నియోజకవర్గంలో గంధవరం, పాండ్రంకి, పెద్దిపాలెం, కోరాడ, శిర్లపాలెం, గోస్తనీ, వెల్లంకి, శొంఠ్యాం, రేవిడి, రెడ్డిపల్లిల్లో కొత్త ఫీడర్లు పెడుతున్నారు. వీటికి సుమారు రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్లను వెచ్చిస్తున్నారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తికాగా మరికొన్ని జూన్ 10వ తేదీ నాటికి పూర్తి కానున్నాయి. వీటన్నింటినీ జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యామ్‌బాబు తెలిపారు. అలాగే వేసవిలో విద్యుత్ సరఫరా మెరుగుకు చిల్లపేట, సుద్దగెడ్డ, తెన్నేటి నగర్, కూర్మన్నపాలెం, తదితర ప్రాంతాల్లో ఐదు కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వీటికి ఒక్కోదానికి రూ.3.5 కోట్లు వెచ్చించామన్నారు.

అనకాపల్లి డివిజన్ విషయానికి వస్తే 61 విద్యుత్ ఫీడర్లలో 43 ఫీడర్లను కేవలం వ్యవసాయ కనెక్షన్ కోసం ప్రత్యేకంగా విభజిస్తున్నారు. సాధారణ గృహ విద్యుత్ అవసరాల కోసం అదనపు ఫీడర్లను పెడుతున్నారు. ఈ పనుల కోసం సుమారు రూ.125.5 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పనులు చేపట్టడానికి వారంలో ఒకటి రెండు రోజులు విద్యుత్ సరఫరాను కొద్ది గంటలపాటు నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని పత్రికల ద్వారా ముందుగానే ప్రజలకు ... మిగతా 4వ పేజీలో

మసాజ్ సెంటర్లపై సీపీ కన్ను



ఇకపై జంబ్లింగ్ తరహాలో తనిఖీలు

- ఒక స్టేషన్ పరిధిలోని మసాజ్ సెంటర్లలో వేరే పోలీస్ స్టేషన్ అధికారులతో సోదాలు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నగర పోలీస్ కమిషనర్ ప్లాన్
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మసాజ్ సెంటర్లు మారుతున్నాయని ఫిర్యాదులు
- నిర్వాహకుల నుంచి పోలీసులు మామూళ్లు తీసుకుంటున్నట్టు ఆరోపణలు
- వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు శంఖబ్రత బాగ్చి ప్రణాళికలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మసాజ్ సెంటర్లను గాడిలో పెట్టడంపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. కొన్ని మసాజ్ సెంటర్లలో మసాజ్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తడం, వాటిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నారనే ఆరోపణలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఇకపై ఒక స్టేషన్ పరిధిలో ఉండే మసాజ్ సెంటర్లలో ఇతర పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బందితో తనిఖీలు చేయించాలని నిర్ణయించారు. దీనివల్ల మసాజ్ సెంటర్లలో అక్రమాలకు చెక్ పడుతుందని సీపీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో 300కి పైగా మసాజ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో కేవలం శరీర మర్దన, కాస్మోటిక్స్‌కు సంబంధించిన సేవలను మాత్రమే అందించాలి. ఇవన్నీ 'బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్ సెక్టార్ కింద బ్యూటీ పార్లర్లు, స్పా, మసాజ్ సెంటర్లు, రిలాక్స్, వెల్‌నెస్ సెంటర్లు, హెల్త్ క్లబ్ వంటి పేర్లతో కార్యకలాపాలను సాగిస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఇలాంటి వాటిలో క్రాస్ జెండర్ (మగవారికి ఆడవాళ్లు, ఆడవారికి మగవారు) మసాజ్ ... మిగతా 4వ పేజీలో

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- నగర సుందరీకరణ, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి
- అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం



విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు జూన్ 10న విశాఖకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం గిరిజన వర్సిటీ వీసీ టీవీ కట్టమణితో కలిసి వివిధ అంశాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూన్ 10వ తుదీ ఉదయం 11.30 గంటలకు ... మిగతా 4వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

జూలై 9న సింహగిరి ప్రదక్షిణ

- ముందస్తు ప్రణాళికలతో విజయవంతం చేయాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో ఈవో వేంద్ర త్రినాథరావు

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): సింహగిరి ప్రదక్షిణ ఉత్సవాన్ని జూలై 9న నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేసేందుకు అధికారులందరూ ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగాలని సింహాచల దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సింహగిరిపై దేవస్థానానికి చెందిన అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఉత్సవంలో పాల్గొనే లక్షలాదిమంది భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయడం వల్ల ఉత్సవాన్ని విజయవంతం చేయవచ్చన్నారు. డిప్యూటీ ఈవో సంగం రాధ, భూపరిరక్షణ విభాగం అధికారి గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

ప్లై ఉడ్ మెటీరియల్ రిలీజ్ ఆర్డర్ జారీకి రూ.30 వేలు డిమాండ్

చివరకు రూ.25 వేలకు ఫైనల్

- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి ద్వారా లంచం డబ్బులు వసూలు
- దాడి చేసి పట్టుకున్న ఏసీబీ అధికారులు

లంకెలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న ప్లైఉడ్ మెటీరియల్ విడుదల (రిలీజ్ ఆర్డర్) చేసేందుకు లంచం డిమాండ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (డీసీటీవో) కిముడు జయలక్ష్మిని అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆమె అనుచరుడైన కాళేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి సన్యాసిరాజు రూ.25 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.



ఏసీబీకి చిక్కిన డీసీటీవో విజయలక్ష్మి

హైదరాబాద్‌కు చెందిన ఇంటీరియర్ డిజైన్ వర్క్ కాంట్రాక్టర్ విశ్వేశ్వర విశ్వనాథ్ విశాఖలో ఇంటీరియర్ డిజైన్ వర్కులు చేస్తుంటారు. ఇందుకోసం రూ.42 వేల విలువ చేసే ప్లై ఉడ్ మెటీరియల్‌ను ఇటీవల హైదరాబాద్‌లో కొనుగోలు చేసి కాళేశ్వరి ట్రాన్స్‌పోర్టు ద్వారా విశాఖ పంపించారు. ఇది వన్‌టౌన్‌లోని ట్రాన్స్ పోర్టు ... మిగతా 4వ పేజీలో

రాత్రిపూట తీరం కాంతివంతంగా ఉండాలి

- ప్రస్తుతం ఉన్న విద్యుత్ దీపాల సామర్థ్యాన్ని పెంచాలి
- సాయంత్రం వేళ క్రీడాకారుల సాధన కోసం కోర్టులను ఏర్పాటు చేయాలి
- మేయర్ పీలా శ్రీనివాసరావు

- 4వ పేజీలో

రేపటి నుంచే రేషన్ డిపోల వద్ద సరకులు

- జిల్లాలో 642 డిపోలు.. 5.34 లక్షల బియ్యం కార్డులు
- 32,701 మందికి ఇంటి వద్దే రేషన్..
- ఎండీయూలు ఇచ్చిన ఈ పోస్ మిషన్లకు మరమ్మతులు
- ప్రతి డిపో వద్ద వివరాలతో కూడిన బోర్డులు
- పలు డిపోలను తనిఖీ చేసిన పౌరసరఫరాల శాఖ అధికారులు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తరువాత ఆదివారం నుంచి రేషన్ డిపోల వద్ద బియ్యం కార్డుదారులకు సరకుల పంపిణీని ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు వీధుల్లో ఎండీయూ వాహనాల వద్ద సరకులు తీసుకునేందుకు కార్డుదారులు పడిన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 642 రేషన్ డిపోల పరిధిలో 5.34 లక్షల బియ్యం ... మిగతా 4వ పేజీలో



రేషన్ డిపోను తనిఖీచేస్తున్న జిల్లా పరిశీలకుడు భగన్నారాయణ, డీఎస్‌వో భాస్కర్

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

చిట్టివలసలో యోగా శిక్షణ

తగరపువలస, మే 30 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, మహిళలకు శుక్రవారం యోగా శిక్షణ ఇచ్చారు. ఆయూష్ విభాగానికి చెందిన డా. ప్రతిభ, వెంకటరెడ్డి, సీఆర్పీ త్రినాథ్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, మెడిటేషన్ అంశాల్లో పోటీలు జరిపారు.

రాములోరి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి) : సింహగిరికి ఈశాన్య దిక్కునున్న సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసు పురస్కరించుకుని నెలకు ఒకసారి లోక కల్యాణార్థం హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి లక్ష్మణ, హనుమ, సీతా సమేత శ్రీరాముడి ఉత్సవమూర్తులను పలు పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. శాస్త్రవిధానంలో లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచమనలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం మండపారాధన, బింబారాధన, కలశారాధన జరిపి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి, హవనాన్ని నిర్వహించారు.

3న ఎర్నిమాంబ అమ్మవారి నెల పండగ

భీమునిపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మంగమారిపేట గ్రామ దేవత ఎర్నిమాంబ నెల పండగ వచ్చేనెల 3న నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. శుక్రవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.

సమ్మెపై చర్చలకు ఉక్కు యాజమాన్యం డుమ్మా

... 3వ పేజీ తరువాయి

సమ్మె ప్రభావం ప్లాంటుపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అడ్మిన్ భవనం వద్ద ఈ నెల 27, 28 తేదీల్లో భారీ ఎత్తున మోహరించి ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని లేఖలో పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్లాంటుకు రక్షణ కల్పించడంతో పాటు ఉత్పత్తికి విఘాతం కలగకుండా వివిధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగిస్తున్నామని, వారంతా రోజుకు 12 గంటలు పనిచేస్తున్నారని, అంతా ఆయా విధుల్లో తీరిక లేకుండా ఉన్నందున చర్చలకు రాలేకపోతున్నామని, చర్చలకు మరో తేదీని సూచించాలని కోరింది. అయితే చర్చలకు వస్తే.. తీసేసిన కార్మికులకు గంగవరం పోర్టు మాదిరిగా నష్టపరిహారం కోరాలని భావించిన కాంట్రాక్టు కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కాగా ఆర్ఎల్సీ జూన్ 10న మరోసారి చర్చలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కాగా ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు మాట్లాడుతూ పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా యాజమాన్యం తన మొండి పట్టుదలను వీడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి పరిష్కారం కోరుతామని వారు తెలిపారు.

విద్యుత్ సరఫరా మెరుగుకు కసరత్తు

... 3వ పేజీ తరువాయి

తెలియజేస్తున్నారు. ఎలమంచిలిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఈ పనులు నిర్వహించడానికి గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకు, ఆ తరువాత మళ్లీ 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం సుమారు ఏడు గంటల పాటు పనులు చేపట్టారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అలాగే అచ్యుతాపురం మండంలోని వెదురువాడ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ముందుగానే ప్రకటించారు. అయితే రాత్రి 7.30 గంటల వరకు పనులు జరగడం వల్ల మరో రెండు గంటలు అదనంగా సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. టవర్ల పైనుంచి విద్యుత్ వైర్లను లాగడం వల్ల ఎక్కువ సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఈ పనులు చేపట్టడం వల్ల వచ్చే పదేళ్ల వరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతామని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రతి శుక్రవారం నిర్వహణ పనుల కోసం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని, ఇప్పుడు కొత్త పనులు చేపట్టడం వల్ల ఇంకో రోజు సరఫరా ఆగుతోందని వివరించారు. డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా ఉందని, పనులు పూర్తయిన తరువాత 24/7 సరఫరా జరుగుతుందన్నారు.



మధురవాడలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వర్షం నీటిలో వాహనదారుల పాట్లు



రుషికొండలో కురుస్తున్న వర్షం

మధురవాడలో కుండపోత వర్షం

మధురవాడ / సాగర్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. చంద్రంపాలెం, వుడాకాలనీ,నగరంపాలెం, మల్లయ్యపాలెం, స్వతంత్రనగర్ కాలనీల్లోని వీధుల్లో వర్షం నీరు వరదలా ప్రవహించింది. మధురవాడ ఎత్తువంతెన కింద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల నుంచి మురుగు నీరు ప్రవహించడంతో సర్వీసు రోడ్లలో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి తోడు గాలులు కూడా వీయడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగింది.అలాగే తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, రుషికొండ లోనూ భారీ వర్షం పడింది. గత కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతున్నప్పటికీ ఇంత భారీ వర్షం పడలేదు. భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు చోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. గాలులు వీయడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తీర ప్రాంతాల భద్రతపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీకృష్ణ

భీమునిపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత భద్రతపై మత్స్యకారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రుషికొండ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు స్టేషన్ ఎస్ఐ జి. మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పోలమాంబ గుడి పక్కనున్న మత్స్యకారుల సదుపాయాల భవనంలో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. జూన్‌లో ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు వస్తుండడంతో భద్రతా అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. తీర ప్రాంతంలో అపరిచిత వ్యక్తులు సంచరించినా, సముద్రంలో అనుమానాస్పద బోట్లు కనిపించినా వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. పాకిస్థాన్‌తో ఇటీవల యుద్ధం జరిగిన నేపథ్యంలో తీర ప్రాంతంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే మత్స్యకారులంతా ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ అధికారులు, మత్స్యశాఖ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ బలోపేతానికి కృషి చేయండి'

పద్మనాభం, మే 30 (ఆంధ్రజ్యోతి) : నూతన కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసీపీ భీమిలి నియోజకవర్గం కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం ఆయన పద్మనాభంలోని పార్టీ కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని విషయాల్లోనూ పార్టీ అండగా ఉంటుందని, గ్రామాల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. దీనిపై నియోజకవర్గం స్థాయిలో జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్. గిరిబాబు, నాయకులు బంగారప్పడు, ఆదిబాబు, ఈశ్వరరావు, వర్మ, గురునాయుడు, అప్పారావు, సన్యాసినాయుడు, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

తగరపువలస, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చేసిన సేవలే వారికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ అన్నారు. శుక్రవారం ఆయన చిట్టివలసలోని ఫంక్షన్ హాలులో ఉపాధ్యాయుడు ఎల్. కనకేశ్వరరావు పదవీ విరమణ సభలో మాట్లాడారు. కనకేశ్వరరావు విద్యార్థులకు చదువు నేర్పడంతో పాటు తాను పని చేసిన గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఎంఈఓ పి. శివరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మురళీమోహన్‌రావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కరుణాకర్, కె. ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఘటాల ఊరేగింపు

పద్మనాభం, మే 30 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో బంగారమ్మ పండగలో భాగంగా శుక్రవారం ఘటాలను ఊరేగించారు. తాలాడ, బు గత కుటుంబాలకు చెందిన వారు ఘటాలను అమ్మవారి మందిరం నుంచి ప్రధాన వీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

సిందూర్ విజయోత్సవ వేడుకలు

సాగర్‌నగర్/ఎండాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎన్‌సీసీ 13వ బెటాలియన్ ఎల్‌టి కల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ పిలుపునిచ్చారు. రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పిజి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 13వ బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణలో భాగంగా శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు సైనికులు ఎలా ప్రాణాలు ఒడ్డి పోరాడుతున్నారో, పౌరులు కూడా దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్లకు నివాళులు అర్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

ఆనందపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభరం, గొంతినవానిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఎమర్జెన్సీ (యూనిసెఫ్) సభ్యురాలు మేరీ జోన్స్, విశాఖ అర్బన్ సీడీపీఓ శ్రీలత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించడానికి మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు 'కిశోరీ వికాసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కిశోర బాలికలకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్టు అధికారి ఎం. శ్రీదేవి, సూపర్‌వైజర్ పీవీవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న స్నేక్‌క్యాచర్ కిరణ్

సాగర్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కాలనీకి ఆనుకుని ఉన్న ప్రైవేట్ లేఅవుట్ గృహ సముదాయంలో గురువారం అర్ధరాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. గృహ సముదాయం సెల్లార్‌లో 12 అడుగుల భారీ కొండచిలువ నివాసితులకు కనిపించింది. వారు స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం ఇవ్వగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను పట్టుకున్నారు. చుట్టూ కొండ ప్రాంతం కావడంతో వర్షాల వల్ల కొండచిలువ అక్కడికి వచ్చి ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

ఉత్సాహంగా బీజేపీ మహిళా మోర్చా చేనేత నడక



ర్యాలీలో పాల్గొన్న మహిళా మోర్చా సభ్యులు, నాయకులు

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి) : పుణ్యశ్లోక అహల్యాబాయి హోల్కర్ సాంఘిక దురాచారాలను వ్యతిరేకించిన ధీర వనిత అని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మధుకర్ అన్నారు. అహల్యాబాయి జయంతి పురస్కరించుకుని బీజేపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పరశురామరాజు సారథ్యంలో శుక్రవారం సింహాచలంలో చేనేత నడక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహల్యాబాయి జీవిత చరిత్రను వివరించారు. ఆమెను నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకముందు తొలిపావంచా వద్ద సింహాద్రినాథునికి పూజలు చేసి, మహిళలు చేనేత నడకను ప్రారంభించారు. తొలిపావంచా నుంచి సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు నడక సాగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ. కేశవకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె. సుహాసినీ ఆనంద్, బుద్ద లక్ష్మీనారాయణ, ఉమ్మడి సుజాత, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వాత్సవాయ్ రోహిణి, కట్ట పద్మ, కార్పొరేటర్ ముమ్మన దేముడు, 98వ వార్డు అధ్యక్షుడు రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రాజీ జ్యోతికి ఎమ్మెల్యే గంటా అభినందనలు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించిన భీమిలి మజ్జిపేటకు చెందిన యర్రాజీ జ్యోతికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. అర్జున అవార్డు గ్రహీత యర్రాజీ జ్యోతి దక్షిణకొరియా గుమిలో జరిగిన పోటీల్లో అథ్లెటిక్ రేస్‌ను కేవలం 12.96 సెకన్లలో పూర్తి చేసి సరికొత్త రికార్డు సాధించారు. ఇండియన్ ఫాస్టెస్ట్ ఉమెన్‌గా పేరుపొందిన జ్యోతి విదేశీ గడ్డపై భారత పతాకాన్ని రెపరెపలాడినట్టు చేశారని, భవిష్యత్తులో ఆమె మరిన్ని రికార్డులు సృష్టించాలని గంటా ఆకాంక్షించారు.

నైజీరియాలో పెట్టుబడులపై గీతంలో సదస్సు

సాగర్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నైజీరియాలోని జిగావా రాష్ట్రంలో భారతీయులకు ఉన్న పెట్టుబడి అవకాశాలను తెలిపేందుకు ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీసీసీఐఎఫ్) ఆధ్వర్యంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్ సమాది మాట్లాడుతూ వ్యవసాయపెట్టుబడులకు అక్కడి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.

నగరంలో తృప్తి క్యాంటీన్లు

... 3వ పేజీ తరువాయి

ఇచ్చిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకపోతే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలపాలని డిమాండ్ చేయడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. అలాగే 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 87వ వార్డు బొండా జగన్ కూడా తమ వార్డులకు సంబంధించిన అంశాలను అజెండాలో చేర్చాలని పట్టుబడుతున్నారు. దీంతో శుక్రవారమే అజెండా కాపీలను కార్పొరేటర్లకు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ సాయంత్రానికి కూడా వారికి చేరకపోవడంతో చర్చకు దారితీసినట్టయింది. ఆయా అంశాలను అనుబంధ అజెండాలో చేర్చుతారా? లేకపోతే 27 అంశాలతోనే అజెండాను ఖరారు చేస్తారా? అన్నది అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

రేపటి నుంచే రేషన్ డిపోల్లో సరకులు

... 3వ పేజీ తరువాయి

కార్డులు ఉన్నాయి. ప్రతినెలా వీరికి ఎనిమిది వేల టన్నుల బియ్యం, 245 టన్నుల పంచదార పంపిణీ చేస్తున్నారు. కార్డుదారులు తమ పరిధిలోని డిపోలకు వెళ్లి సరకులు తీసుకునేలా ఆయా ప్రాంతాల్లో ప్రచారంచేస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచే సరకులను పంపిణీ చేసేందుకు గాను రేషన్ డిపోలను అందంగా తీర్చిదిద్దాలని డీలర్లకు ఆదేశాలిచ్చారు. ప్రత్యేకించి డిపో ముందు బోర్డు ఏర్పాటు చేసి డిపో నంబర్, డీలర్ పేరు, ఏరియా పేరు, సర్కిల్ నంబర్, స్టాకు వివరాల మొత్తాన్ని బోర్డులో పొందుపరిచేలా చేశారు. ఒకటో తేదీన ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను పిలిచి కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశించారు. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు రేషన్ డిపోలను తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి వి. భాస్కర్, జిల్లా పరిశీలకుడు, పౌరసరఫరాలశాఖ డీడీ భగన్నారాయణలు నగరంలోని పలు డిపోలను సందర్శించి డీలర్లకు సూచనలు చేశారు. ప్రతి డిపోలో రికార్డులు, ఈపోష్ మిషన్లు తనిఖీ చేసి అవసరమైన సూచనలు ఇచ్చారు. సరకుల పంపిణీలో తేడాలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే సరకులు ఇవ్వాలన్న ఆదేశాల మేరకు జిల్లాలో అటువంటివారు 32,701 మంది ఉన్నట్టు గుర్తించారు. సర్కిల్-1లో 8,672 మంది, సర్కిల్-1లో 8,200, సర్కిల్-3లో 7,891, భీమిలి మండలంలో 3,091, పద్మనాభంలో 2,023, ఆనందపురంలో 1,852, పెందుర్తిలో 972 మంది ఉన్నారు.

వీరికి ఇళ్ల వద్దు సరకుల పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఇదిలావుండగా జిల్లాలో ఎండీయూ ఆపరేటర్లు అందజేసిన ఈ-పోస్ మిషన్లకు పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మరమ్మతులు చేసి డీలర్లకు అందజేస్తున్నారు. కార్డుదారులకు రశీదులు ఇచ్చేందుకు వీలుగా పేపర్ రోల్స్‌ను డీలర్లకు సరఫరా చేశారు.



ఆర్కే బీచ్ వద్ద లైటింగ్‌పై అధికారులకు సూచనలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

రాత్రిపూట తీరం కాంతివంతంగా ఉండాలి

మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరానికి మణిహారమైన బీచ్ అందాలను నగరవాసులు, పర్యాటకులు రాత్రిపూట ఆస్వాదించేందుకు వీలుగా సముద్ర తీరం కాంతులీనేలా చర్యలు చేపట్టాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జూన్ 21న తీరంలో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో జరిగే యోగా డే వేడుకల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మేయర్ శుక్రవారం రాత్రి ఆర్కే బీచ్ నుంచి తెన్నేటి పార్కు వరకు తీరంలోని పరిస్థితులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తీరంలో లైటింగ్ సరిగ్గా లేకపోవడం, అక్కడక్కడ ఉన్న విద్యుత్ దీపాలు కాంతివంతంగా లేకపోవడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బీచ్ ఒడ్డున గట్టుపై కూర్చునే వారికి సముద్రపు అలలు, ఇసుకతెన్నెలు స్పష్టంగా కనిపించేలా ఎక్కడికక్కడ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యుత్ బల్బుల స్థానంలో అధిక కాంతిని వెదజల్లే అత్యాధునికమైన లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల బీచ్ అందాలను రాత్రివేళ సందర్శకులు వీక్షించడానికి అవకాశం కల్పించడంతోపాటు బీచ్‌లో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మత్తు మందు సేవించే బ్యాచ్‌లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. రోప్‌వే నుంచి సీతకొండ వరకు తీరాన్ని అభివృద్ధి చేసినా లైటింగ్ సరిగ్గా లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయిందన్నారు. తెన్నేటి పార్కు వద్ద చిరుతిళ్లు విక్రయించే వారి స్టాల్స్ వద్దకు వెళ్లి వారు విక్రయించే ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రతీ వ్యాపారి దుకాణం పక్కనే డస్ట్‌బిన్లను పెట్టుకుని, బీచ్‌ను సుందరంగా ఉంచడానికి సహకరించాలని సూచించారు. తీరం వెంబడి సాయంత్రంవేళ క్రీడాకారులు సాధన చేసేందుకు వీలుగా అవకాశం ఉన్నచోట కోర్టులు ఏర్పాటు చేయడంతోపాటు లైటింగ్ సదుపాయం కల్పించే అంశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. మేయర్ వెంట జెడ్సీ శివప్రసాద్, ఈఈ శ్రీధర్, డీఈ అన్నమనాయుడు, తదితరులు ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

... 3వ పేజీ తరువాయి



నగదు తీసుకున్న డీసీటీవో అనుచరుడు సన్యాసిరాజు

గోదాముకు చేరింది. అక్కడి నుంచి మెటీ రియల్ తీసుకెళ్లడంలో విశ్వనాథ్ కొంత ఆలస్యం చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న డీసీటీవో జయలక్ష్మి గోదామును తనిఖీ చేసి ప్లై ఉడ్ మెటీరియల్‌ను పరిశీలించారు. దీనికి సంబంధించి క్యారియింగ్ ఇన్వాయిస్ లేకపోవడంతో సరకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో విశ్వనాథ్.. డీసీటీవో జయలక్ష్మిని కలిసి మెటీరియల్ రిలీజ్ చేయాలని కోరారు.రూ.30 వేలు లంచం ఇస్తేనే రిలీజ్ ఆర్డర్ ఇస్తానని ఆమె స్పష్టం చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని విశ్వనాథ్ ప్రాధేయపడగా.. రూ.25 వేలకు తగ్గించారు. లంచం సొమ్మును తన అనుచరుడైన కాశేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి మామిడిపాక సన్యాసిరాజుకు ఇవ్వాలని ఆమె సూచించారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని విశ్వ నాథ్ గురువారం ఏసీబీ అధికారులను ఆశ్ర యించారు. వారు చెప్పిన మేరకు శుక్రవారం ఉదయం వన్ టౌన్‌లోని గోదాము వద్ద సన్యాసిరాజుకు లంచం డబ్బులు ఇస్తుండగా.. అప్పటికే మాటు వేసి వున్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం సన్యాసిరాజును లంకెలపాలెంలో వున్న అచ్యుతాపురం సర్కిల్ డివిజన్-2 వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి డీసీటీవో జయలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. తరువాత కార్యాలయంలో తనిఖీలు చేసి, ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు సుప్రియ, శ్రీనివాస్, లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్లపై సీపీ కన్ను!

... 3వ పేజీ తరువాయి

చేయడాన్ని పోలీసులు అనుమతించరు. మసాజ్ సెంటర్/స్పాలలో పురుషులకు, మహిళలకు వేర్వేరు సెక్షన్లను ఏర్పాటు చేయాలి. లోపలకు ప్రవేశించడానికి ఒక మార్గం, బయటకు వెళ్లేవారికి ఒక మార్గం వేర్వేరుగా ఉండాలి. వారికి టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు కూడా వేర్వేరుగా ఉండడంతో పాటు లోపల ఒక గది నుంచి మరొక గదిలోకి వెళ్లేలా అంతర్గత ద్వారాలు ఉండకూడదు. సెంటర్‌లోకి అడుగుపెట్టిన వారికి ప్రతీదీ కనిపించేలా ఉండే ట్రాన్స్‌ప్రింట్ అద్దాలను మాత్రమే ఏర్పాటు చేయాలి. పదిమంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నట్టయితే వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వడం, మహిళా సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగం వంటివి అందుబాటులో ఉంచాలి. మసాజ్ సెంటర్/స్పాలలో ఫిజియోథెరపిస్టు లేదా ఆక్యుపెజర్ లేదా ఆక్యుపేషనల్ థెరపీలో డిగ్రీ, డిప్లొమా లేదంటే సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లను మాత్రమే నియమించుకోవాలి. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే వీటిని తెరిచి ఉంచాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను వీడియో రికార్డు చేసేలా అన్నిచోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు కనీసం మూడు నెలల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్ డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి. కానీ నగరంలోని మసాజ్ సెంటర్/స్పాల్లో మాత్రం ఈ నిబంధనలేవీ మచ్చుకైనా అమలు కావడం లేదనేది నేడి బహిరంగ రహస్యం.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

నగరంలోని మసాజ్ సెంటర్‌లు/స్పాలలో ఒకటి, రెండు మినహా మిగిలిన వాటన్నింటిలోనూ క్రాస్ జెండర్ మసాజ్‌లు, వ్యభిచారం వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. థాయ్‌లాండ్, కేరళ, గోవా వంటి ప్రాంతాల నుంచి యువతులను నగరానికి తెప్పించి వారితో మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నాళ్ల కిందట నగరంలోని మసాజ్ సెంటర్లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా థాయ్‌లాండ్‌కు చెందిన యువతులు స్పా సెంటర్లలో ఎటువంటి అనుమతి లేకుండా పనిచేస్తున్నట్టు గుర్తించారు. అలాగే కొన్ని సెంటర్లలో వాడిపడేసిన కండోమ్‌లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. సెంటర్లలో పనిచేస్తున్న వారిలో మసాజ్ గురించి అవగాహన లేని యువతులే పనిచేస్తున్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు మసాజ్ సెంటర్ల నిర్వాహకులను పిలిచి ఆయా సెంటర్లకు సంబంధించిన నియమ నిబంధనలు, పాటించాల్సిన జాగ్రత్తలు, ఉల్లంఘించిన వారిపై తీసుకునే చర్యలు, ఎదురయ్యే శిక్షల గురించి వివరించారు. అయినప్పటికీ వారిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ ఒక్కో మసాజ్ సెంటర్ స్థాయిని బట్టి సగటున రూ.పది వేల చొప్పున నెలనెలా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు చేరిపోతోందని, అందువల్లే చర్యలు ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జంబ్లింగ్ తనిఖీలతో అక్రమాలకు చెక్

మసాజ్ సెంటర్ల నిర్వాహకులతో పలువురు పోలీసులు అవగాహన ఏర్పరుచుకున్నారని సీపీ శంఖబ్రత బాగ్చికి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ఆదేశాలతో సిబ్బంది నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే సమాచారం సీపీకి చేరింది. పోలీసులు మసాజ్ సెంటర్లు/స్పాల నిర్వాహకులతో మిలాఖత్ కావడంతో దాడులు చేసినప్పుడు ముందుగానే వారికి సమాచారం అందజేసి అప్రమత్తం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందువల్లే తనిఖీల సమయంలో పోలీసులు తమకు ఎలాంటి ఉల్లంఘనలు కనిపించలేదని నివేదిక ఇస్తున్నారని సీపీ భావిస్తున్నారు. ఇకపై దీనికి అడ్డుకట్ట వేయాలంటే తరచూ మసాజ్ సెంటర్లు/స్పాలపై దాడులు నిర్వహించాల్సిందేనని భావిస్తున్నారు. అలా దాడులు చేసినప్పుడు ఒక స్టేషన్ పరిధిలోని మసాజ్ సెంటర్‌లు/స్పాలలో తనిఖీలు చేసేందుకు వేరే పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బందికి బాధ్యతలు (జంబ్లింగ్) అప్పగించడం వల్ల అక్రమార్కులు తప్పించుకునే అవకాశం ఉండదని సీపీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ విధానంలో మసాజ్ సెంటర్లు/స్పాలలో తనిఖీలకు శ్రీకారం చుడతామని ఆయన తెలిపారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

... 3వ పేజీ తరువాయి

రాష్ట్రపతి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గంగుండా సాగరతీరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్‌కు వస్తారన్నారు. అక్కడ జరిగే స్నాతకోత్సవంలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఆమె పాల్గొంటారన్నారు. అనంతరం రోడ్డు మార్గం గుండా విమానాశ్రయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, విమానాశ్రయం నుంచి బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్ వరకు సుందరీకరణ పనులుతో పాటు రహదారులకు మరమ్మతులను చేపట్టాలన్నారు. జ్ఞానాపురం రైల్వే అండర్ పాస్‌వే వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఒకవేళ వర్షం పడితే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలన్నారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాల్ వరకు ఎలాంటి హోర్డింగ్‌లు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న నేపథ్యంలో ప్రత్యేక గ్రీన్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, ఏయూ కన్వెన్షన్ హాల్ వద్ద పారిశుధ్యపరమైన ఇబ్బందులు లేకుండా జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. నిపుణులతో కూడిన వైద్య బృందం, అత్యాధునికైన అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడంతో పాటు పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపించిన పెదగదిలి జంక్షన్

» భారీ వర్షంతో వాహనదారుల ఇబ్బందులు » కాలువల ఆధునికీకరణ చేపట్టాలంటున్న స్థానికులు, వాహనదారుల వినతి



చెరువులా తయారైన పెదగదిలి జంక్షన్‌లో వాహనదారుల అవస్థలు

ఆరిలోవ, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెదగదిలి జంక్షను వరదనీటిమయం అయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. సాధారణంగా చిన్నపాటి వర్షం వస్తేనే ఈ జంక్షనులో వర్షం నీరు నిలిచిపోతుంది. అలాంటిది శుక్రవారం జోరు వాన కురవడంతో జంక్షను తటాకాన్ని తలపింపజేసింది. కాలువలు చిన్నవి కావడం వల్ల మురుగు నీరు రోడ్లపైకి చేరింది. కొండవాలు ప్రాంతం కావడంతో వాడుక నీటితో పాటు వరదనీరు విపరీతంగా చేరింది. పల్లపు ప్రాంతం అవడం వల్ల జంక్షనులో అధికంగా వర్షం నీరు చేరి చాలాసేపు నిలిచిపోయింది. కాలువల్లో పూడికలు నిండిపోవడంతో వర్షం నీరు సకాలంలో పారే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా వాన వెలసిన తర్వాత వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. ముఖ్యంగా.. ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు.

ఈ ప్రాంతంలో కాలువలు చిన్నవిగా ఉండడంతో పాటు అందులో పూడికను తొలగించకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి నీరు నిలిచిపోయి చెరువులా తయారవుతోంది. ప్రతిసారి ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నటికీ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కాలువలు వెడల్పు చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారే లేరని ఆరోపిస్తున్నారు. ఇలా వర్షం వచ్చినపుడు నీరు నిలిచిపోయి అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు నిలిచిపోవడంతో తోపుడు బండ్ల వ్యాపారులు, ఫ్లాట్‌ఫామ్స్‌పై కూరగాయలు విక్రయించేవారు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. హనుమంతవాక జంక్షను సిగ్నల్‌పాయింట్ నుంచి పెదగదిలి వచ్చే మార్గంలో కూడా వరద నీరు నిలిచి పోతోంది. పెదగదిలిలో గల చిల్డ్రన్ పార్కులో కూడా నీరు నిలిచిపోయింది. దీంతో కొన్ని రోజుల పాటు పార్కులోకి చిన్నారులు వెళ్లడానికి వీలు లేని పరిస్థితి నెలకొందివర్షాకాలం నేపథ్యంలో ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడ కాలువల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట పెట్రోలు బంకు వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శివాజీపాలేనికి చెందిన పాతరపల్లి వెంకటరమణ శౌంర్యాంలో టిఫిన్ మాస్టరుగా పని చేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో విధి నిర్వహణకు బయలుదేరి ఇసుకతోట బస్టాపు వైపు నడిచి వెళ్లాడు. జాతీయ రహదారిపై అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. టిఫిన్ సెంటరు యజమాని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, వెంకటరమణ పనికి రాలేదని చెప్పడంతో, భార్య కొండమ్మ, వెంకటరమణ ఫోన్‌కు ప్రయత్నించగా, ఎంవీపీ పోలీసులు లిఫ్ట్‌చేసి, సదరు వ్యక్తికి ప్రమాదం జరిగిందని సమాచారం ఇచ్చారు. కొండమ్మ ఫిర్యాదు మేరకు ఎంవీపీ ఏఎస్ఐ సత్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌత్ ఇండియా కరాటే పోటీలకు ఎంపికలు



కరాటే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఎంవీపీ కాలనీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1న ఎంవీపీ కాలనీ అప్పుఘర్ పోలమాంబ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న సౌత్ ఇండియా ఓపెన్ చాంపియన్‌షిప్ కరాటే పోటీలకు బ్రూస్‌లీ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ తరపున క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చీఫ్ కోచ్ చిన్నా తెలిపారు. బాలికల విభాగంలో 12 ఏళ్ల విభాగంలో తేజస్విని, 13 ఏళ్ల విభాగంలో జీవీ ఆరాధ్య, 16 ఏళ్ల విభాగంలో కావ్య, 17 ఏళ్ల విభాగంలో సౌమ్య, బాలురలో 12 ఏళ్ల విభాగంలో తనుష్, 13 ఏళ్ల విభాగంలో మనోజ్ యాదవ్ ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గౌరీ ప్రియ, వైభవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం'

ఉక్కుటౌన్‌షిప్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, యాజమాన్యాలు అనుసరిస్తున్న నిరంకుశవిధానాలు, నిర్బంధాలపై ఐక్య పోరాటాలు చేయాలని స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భవ దినోత్సవాన్ని శుక్రవారం ప్లాంటు అడ్మిన్ భవనం మార్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ఐక్యతను విచ్ఛిన్నం చేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.

సినిమా గైడ్

● **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కరాటే కిడ్** : శారద
● **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
● **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
● **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
● **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 20, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

స్వయంశక్తి సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రణాళికలు

కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ, మండల పరిషత్ ప్రతినిధులు, అధికారులు



సమావేశంలో పాల్గొన్న కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో స్వయంశక్తి సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రణాళికలు అమలుచేయాలని కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. శుక్రవారం రాడిసిన్‌బ్లూ హోటల్‌లో పంచాయతీ, మండల పరిషత్ ప్రతినిధులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ స్వయంశక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించిన పంచాయతీలలో సంఘాలకు లాభదాయకమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రణాళికలు పక్కాగా అమలుచేయాలన్నారు. సదస్సు నిర్వహణలో భాగంగా ఎంపిక చేసిన 88 మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. సదస్సులో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, పలువురు జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయాలు

» కబేలాలో అనుమతి పొందకుండా యథేచ్ఛగా అమ్మకాలు
» పట్టించుకోని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు



కబేలా స్టాంపు లేకుండా వధించిన మేకను మాంసం విక్రయానికి ఉంచిన దృశ్యం

ఆరిలోవ, మే 30 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మటన్ విక్రయ కేంద్ర వద్ద నిబంధనలు పాటించకుండా మాంసం విక్రయాలను చేపడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసి కబేలాలో అనుమతి స్టాంపులు లేకుండా ఈ జంక్షన్‌లో యథేచ్ఛ మాంసం విక్రయాలు చేపడుతున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నగరంలో మటన్ అమ్మే వారంతా జీవీఎంసీ కబేలాలో అనుమతి పొందాల్సి ఉంటుంది. మటన్ కోసం బలి ఇచ్చే జంతువును కబేలాలో పశువైద్యులు పరిశీలించి, అంతా సరిగా ఉంటేనే అనుమతి ఇస్తారు. ఇందుకోసం సదరు జంతువు వధించిన తర్వాత దానిపై స్టాంపును వేస్తారు. ఆ జంతువుకు సంబంధించిన మాంసాన్ని మాత్రమే విక్రయించాలి. అయితే ఇక్కడ మాంసం వ్యాపారులు అవేవీ పాటించడం లేదని, కబేలాకు తరలించకుండా సొంతంగా మేకలు, గొర్రెలను చంపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల శుచి, శుభ్రత లేని మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారని పలువురు కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉంచి మాంసం కూడా విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇక్కడి మాంసం వ్యాపారులది 'ఆడింది ఆట..' చందంగా పరిస్థితి తయారైందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో మాంసం వ్యాపారాలపై జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

'దళితుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు'

సింధియా, మే 30, (ఆంధ్రజ్యోతి) : దళితుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ జంక్షన్‌లో గురువారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా దళిత నాయకులు సాంబమూర్తి, కామేశ్వరరావు, అప్పారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చిత్రకళా ప్రతిభకు తార్కాణం స్పెక్ట్రమ్

» ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులకు ఏయూ వీసీ రాజశేఖర్ ప్రశంస



ప్రదర్శనలో ఉంచిన శిల్పాలను తిలకిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అద్భుత ప్రతిభకు ప్రత్యక్ష తార్కాణంగా స్పెక్ట్రమ్ ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన స్పెక్ట్రం-2025ను ఆయన శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన శిల్పాలు, చిత్రాలను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ విస్తృత స్థాయిలో ఒక ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని వీసీ రాజశేఖర్ సూచించారు. విద్యార్థులు రూపొందించిన శిల్పాలు, పెయింటింగ్‌లను నిశితంగా పరిశీలించి వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతికత, కళ మిళితం చేస్తూ విద్యార్థులు తీర్చిదిద్దిన కళారూపాలను ఎంతగానో బాగున్నాయంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ఆకృతులు పరిశీలించి విద్యార్థులతో ముచ్చటిస్తున్న వీసీ

కార్మిక లేబర్ కోడ్స్ రద్దుకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్కెఎస్వీ కుమార్

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను మరింత బానిసలుగా చేస్తోందన్నారు. ఈ లేబర్ కోడ్స్‌కు రద్దుకు జూలై 9న చేపట్టే సమ్మెతో సిద్ధం కావాలన్నారు. కార్మికవర్గం ఐక్యంగా కదిలి హక్కులను కాపాడుకోవాలన్నారు. సీఐటీయూ ఆవిర్భవించిన 55 ఏళ్లలో అనేక పోరాటాలు చేసి కార్మికులకు అండగా నిలిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా కార్మిక హక్కులు, సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించామన్నారు. కార్మిక చట్టాలు, పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, గ్రాడ్యుటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కార్మిక హక్కులపై సుదీర్ఘ పోరాటాలు చేస్తూ అన్ని రంగాల్లో సీఐటీయూ విస్తరించిందన్నారు. ప్రభుత్వం కార్మికు వ్యతిరేక విధానాలకు పాల్పడిన ప్రతిసారి కార్మిక సంఘాలను ఐక్యం చేస్తూ దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తోందన్నారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.వెంకటరావు, కృష్ణారావు, పి.రాజు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు కార్మికుల సమ్మెపై పోలీసుల నిర్బంధం తగదు : సీఐటీయూ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, కార్యకర్తలు

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై పోలీసులు నిర్బంధం ఆపి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను నిర్బంధించడానికి నిరసనగా శుక్రవారం మద్దిలపాలెంలో సీఐటీయూ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని 1560 రోజుల నుంచి నిరహారదీక్షలు చేస్తున్నామన్నారు. కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కాపాడడానికి, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు, ప్లాంట్‌కు ముడి సరుకు కొనుగోలుకు వాడలేదని, అప్పులు, వడ్డీలు, జీఎస్టీలు చెల్లించడానికే వాడారని విమర్శించారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్‌మంగళం, డి.అప్పలరాజు, పి.వెంకట్రావు, కృష్ణారావు, నరేంద్రకుమార్, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, ఆరోగ్య పరిరక్షణ

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



యోగాసనాలు వేస్తున్న కృష్ణా కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఏకగ్రతతో పాటు మానసిక ఉల్లాసం పెంచుకోవచ్చని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రాధాన్యత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగా చేయడాన్ని విధిగా అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా 'ఒక భూమి.. ఒక ఆరోగ్యం కోసం యోగా' అనే థీమ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనిపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ తీసుకున్న దత్తత గ్రామాల్లో యోగా ప్రాధాన్యాన్ని వివరించే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే కళాశాలలో యోగాపై వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహిస్తామని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. జాతీయ సేవా పథకం జోనల్ అధికారి పి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ యోగాసానాల అలవాటు చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని, అందుకే అందరు రోజుకు గంట రెండు గంటల పాటు యోగాసనాలు వేయాలన్నారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులు యోగాసానాలు వేశారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు కుసుమకుమారి, జీవీ ప్రతాప్, బి.లక్ష్మీ, బి.నాగేశ్వరరావు, సంధ్యారాణి, రవిబాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం విజయవంతం చేయండి

» వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పలవురు వైసీపీ నేతలు

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ఏడాది పూర్తి చేసినందుకు నిరసనగా ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి పార్టీలు సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికల్లో ప్రచారం చేసి గెలుపొందాయన్నారు. అధికారం వచ్చాక హామీలను నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

'పొగాకుకు దూరంగా మెలగాలి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ఆరిలోవ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో నోటి క్యాన్సర్ కేసులలో దాదాపు మూడింట ఒక వంతు భారతదేశంలో కనిపిస్తున్నాయని అపోలో వైద్య బృందం పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆరిలోవ హెల్త్ సిటీలో గల అపోలో వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ఏటా 77 వేల కొత్త కేసులు బయట పడుతుండగా, 52 వేల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో పొగాకు వినియోగం ఎక్కువగా ఉండడంతో ఇక్కడ కేసుల రేటు కూడా అధికంగా ఉంటోందన్నారు. పొగాకు వాడకం వల్ల నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉందన్నారు. కాబట్టి పొగాకుకు దూరంగా ఉండడమే ఉత్తమమని సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు కృష్ణ నేటి తరం నటీనటులకు ఆదర్శనీయమని ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన డాబాగార్డెన్స్ పల్లవి మ్యూజిక్ కార్యాలయం ఆవరణలో సూపర్ స్టార్ కృష్ణ 60 వసంతాల సినీ వజ్రోత్సవంలో భాగంగా 82వ జయంతి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 31న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు సంస్థ అధినేత పల్లా బాబ్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, డా.టి.కుమార్‌రాజు, వ్యాఖ్యాత లక్ష్మీ స్వరూప, ఎ. వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి సునీల్‌కుమార్‌కు సన్మానం



సభలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్ కుమార్

జ్ఞానాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : చిత్తశుద్ధితో పని చేయడంతో పాటు సౌమ్యశీలిగా అందరి మన్ననలు పొందిన అధికారి డాక్టర్ సునీల్ కుమార్ అని జోనల్ కమిషనర్ బి. రాము కొనియాడారు. జోన్-5 కార్యాలయంలో సహాయ వైద్యాధికారిగా పని చేసిన సునీల్‌కుమార్ పదోన్నతిపై ఈఎన్‌టీ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయనకు శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. జడ్సీ , తదితరులు సునీల్‌కుమార్‌ను సన్మానించి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సర్వే

జ్ఞానాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధిలో చేపడుతున్న వీధి విక్రయదారుల సర్వేకు సహకరించాలని జోనల్ కమిషనర్ బి. రాము శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయాల పరిధిలో వెల్ఫేర్ కార్యదర్శులకు వివరాలు తెలియజేయాలని కోరారు. సర్వేలో నమోదైన వారికి ప్రభుత్వం వెండర్ కార్డు, సర్టిఫికెట్లు జారీ చేస్తుంద న్నారు. జోన్ పరిధిలో 7300 మంది వ్యాపారులు ఉండగా ఇప్పటివరకు 1300 మంది మాత్రమే సర్వేలో పాల్గొన్నారని తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారం

మహారాణిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలతో అధికారులు సమన్వయంతో వ్యవహరించి వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పేలా ప్రోత్సహించాలని కోరారు.

విద్యుత్ సరఫరా మెరుగుకు కసరత్తు

(3వ పేజీ తరువాయి)

తెలియజేస్తున్నారు. ఎలమంచిలిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఈ పనులు నిర్వహించడానికి గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకు, ఆ తరువాత మళ్లీ 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం సుమారు ఏడు గంటల పాటు పనులు చేపట్టారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ముందుగానే ప్రకటించారు. అయితే రాత్రి 7.30 గంటల వరకు పనులు జరగడం వల్ల మరో రెండు గంటలు అదనంగా సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. టవర్ల పైనుంచి విద్యుత్ వైర్లను లాగడం వల్ల ఎక్కువ సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఈ పనులు చేపట్టడం వల్ల వచ్చే పదేళ్ల వరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతామని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రతి శుక్రవారం నిర్వహణ పనుల కోసం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని, ఇప్పుడు కొత్త పనులు చేపట్టడం వల్ల ఇంకో రోజు ఆగుతోందని వివరించారు. డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా ఉందని, పనులు పూర్తయిన తరువాత 24/7 సరఫరా జరుగుతుందన్నారు.

రాత్రిపూట తీరం కాంతివంతంగా ఉండాలి

మేయర్ పీలా శ్రీనివాసరావు



ఆర్కే బీచ్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరానికి మణిహారమైన బీచ్ అందాలను నగరవాసులు, పర్యాటకులు రాత్రిపూట ఆస్వాదించేందుకు వీలుగా సముద్ర తీరం కాంతులీనేలా చర్యలు చేపట్టాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జూన్ 21న తీరంలో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో జరిగే యోగా డే వేడుకల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మేయర్ శుక్రవారం రాత్రి ఆర్కే బీచ్ నుంచి తెన్నేటి పార్కు వరకు తీరంలోని పరిస్థితులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తీరంలో లైటింగ్ సరిగ్గా లేకపోవడం, అక్కడక్కడ ఉన్న విద్యుత్ దీపాలు కాంతివంతంగా లేకపోవడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బీచ్ ఒడ్డున గట్టుపై కూర్చునే వారికి సముద్రపు అలలు, ఇసుకతెన్నెలు స్పష్టంగా కనిపించేలా ఎక్కడికక్కడ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యుత్ బల్బుల స్థానంలో అధిక కాంతిని వెదజల్లే అత్యాధునికమైన లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల బీచ్ అందాలను రాత్రివేళ సందర్శకులు వీక్షించడానికి అవకాశం కల్పించడంతోపాటు బీచ్‌లో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మత్తు మందు సేవించే బ్యాచ్‌లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. రోప్‌వే నుంచి సీతకొండ వరకు తీరాన్ని అభివృద్ధి చేసినా లైటింగ్ సరిగ్గా లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయిందన్నారు. తెన్నేటి పార్కు వద్ద చిరుతిళ్లు విక్రయించే వారి స్టాల్స్ వద్దకు వెళ్లి వారు విక్రయించే ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రతీ వ్యాపారి దుకాణం పక్కనే డస్ట్‌బిన్లను పెట్టుకుని, బీచ్‌ను సుందరంగా ఉంచడానికి సహకరించాలని సూచించారు. తీరం వెంబడి సాయంత్రంవేళ క్రీడాకారులు సాధన చేసేందుకు వీలుగా అవకాశం ఉన్నచోట కోర్టులు ఏర్పాటు చేయడంతోపాటు లైటింగ్ సదుపాయం కల్పించే అంశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. మేయర్ వెంట జెడ్సీ శివప్రసాద్, ఈఈ శ్రీధర్, డీఈ అన్నమనాయుడు, తదితరులు ఉన్నారు.

యోగా విజయవంతానికి ప్రణాళిక అవసరం : కలెక్టర్

మహారాణిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు, పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే వేదికలతో పాటు అనువైన ప్రాంతాల్లో మరో 25 వేదికలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వాటి వద్ద మౌలిక వసతులతో పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ ప్రాంతం వారు ఆ కంపార్ట్‌మెంట్‌కు చేరుకోవాలి, ఏ వాహనం ఎక్కడికి చేరుకోవాలి అన్న అంశాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రధాన వేదికతో పాటు ఎంజీఎం గౌండ్. వీఎంఆర్‌డీఏ పార్కు, అప్పుఘర్, ఎగ్జిబిషన్ గౌండ్, రామా నాయుడు స్టూడియో కింద విశాఖ వ్యాలీ రోడ్డు, భీమిలీ హౌసింగ్ బోర్డు లేఅవుట్, ఐఎన్ఎస్ కళింగ మైదానంలో యోగాసనాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. ఆయా ప్రాంత కార్యక్రమాలను ప్రధాన వేదికకు అనుసంధానం చేస్తూ ప్రజలను భాగస్వా మ్యం చేయాలని అధికారులకు సూచించారు. కాగా తొట్ల కొండపై జూన్ 1న యోగాంధ్రా నిర్వహించనున్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు యోగాసనాలు వేయనున్నారు. ఇండియన్ నేవీ యోగా అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధికారులు భాగస్వామ్యం కానున్నారు.

తెలంగాణ మాఫియా చేతిలో ఏపీలోని థియేటర్లు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు నారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు

డాబాగార్డెన్స్, మే 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు చెందిన కొంతమంది నిర్మాతల చేతిలో ఆంధ్రప్రదేశ్‌లో చలన చిత్ర పరిశ్రమ నలిగిపోతోందని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు జేఏ నారాయణరావు అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్యుడు థియేటర్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారని తెలిపారు. థియేటర్లలో సమోసా, పాప్‌కార్న్, వాటర్‌బాటిల్స్ కూల్‌డ్రింక్స్ ధరలను అత్యంత దారుణంగా పెంచి విక్రయిస్తున్నారన్నారు. దీంతో వినోదం కోసం వెళ్లిన ప్రేక్షకులకు చేతి చమురు వదులుతోందని విమర్శించారు. వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే థియేటర్లలో పారిశుధ్యం, పార్కింగ్ ఫీజుల రేట్లు తక్షణమే తగ్గించేలా చూడాలని కోరారు. పోరాట సమితి న్యాయవాదులు కాశీభట్ట స్వరూప్, పాకా సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయపరంగా వీటిపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏయూ ఉద్యమ సంఘం నాయకులు బొట్ట రామచంద్రయాదవ్, బీసీ రాష్ట్ర నాయకుడు తోట వాసుదేవరావు,సామాజిక వేత్త సీతారామస్వామి, మంత్రి రాజశేఖర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

(3వ పేజీ తరువాయి)



నగదు తీసుకున్న డీసీటీవో అనుచరుడు సన్యాసిరాజు

గోదాముకు చేరింది. అక్కడి నుంచి మెటీరియల్ తీసుకెళ్లడంలో విశ్వనాథ్ కొంత ఆలస్యం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న డీసీటీవో జయలక్ష్మి గోదామును తనిఖీ చేసి ప్లైఉడ్ మెటీరియల్‌ను పరిశీలించారు. దీనికి సంబంధించి క్యారియింగ్ ఇన్వాయిస్ లేకపోవడంతో సరకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో విశ్వనాథ్.. డీసీటీవో జయలక్ష్మిని కలిసి మెటీరియల్ రిలీజ్ చేయాలని కోరారు. రూ.30 వేలు లంచం ఇస్తేనే రిలీజ్ ఆర్డర్ ఇస్తానని ఆమె స్పష్టం చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని విశ్వనాథ్ ప్రాధేయపడగా.. రూ.25 వేలకు తగ్గించారు. లంచం సొమ్మును తన అనుచరుడైన కాశేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి మామిడిపాక సన్యాసిరాజుకు ఇవ్వాలని ఆమె సూచించారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని విశ్వనాథ్ గురువారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు శుక్రవారం ఉదయం వన్ టౌన్‌లోని గోదాము వద్ద సన్యాసిరాజుకు లంచం డబ్బులు ఇస్తుండగా.. అప్పటికే మాటు వేసి వున్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం సన్యాసిరాజును లంకెలపాలెంలో వున్న అచ్యుతాపురం సర్కిల్ డివిజన్-2 వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి డీసీటీవో జయలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. తరువాత కార్యాలయంలో తనిఖీలు చేసి, ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు సుప్రియ, శ్రీనివాస్, లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి వేదికపై కల్యాణ క్రతువు జరిపారు.

జ్ఞానాపురంలో భారీ వర్షం



జ్ఞానాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కాన్వెంటు కూడలి, వెజిటేబుల్ మార్కెట్, డాల్ఫిన్ హోటల్ రోడ్డు తదితర ప్రాం తాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం పడింది. చావులమదుం బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది నీటిలోనించి వాహనాలను తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

కంచరపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి రాంజీ ఎస్టేట్‌లో గల లక్ష్మీగణపతి ఆలయం 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి విశిష్ట పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తనయ శ్యామలా దీపిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



ముగింపు శిబిరంలో ట్రోఫీతో విజేతలు

అక్కయ్యపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారం ఘనగా ముగిశాయి. రైల్వే మైదానంలో ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చి దిద్దడమే ప్రధాన ఉద్దేశంతో కేవలం రైల్వే ఉద్యోగుల పిల్లలకు మాత్రమే కాకుండా స్థానిక యువతకు శిక్షణ అవకాశం కల్పించామన్నారు. శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నీలో విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు.

రేపు పలు రైళ్లు రద్దు

అక్కయ్యపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, రాయగడ సెక్షన్‌లో నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు: జూన్ 1న విశాఖ-కొరాపుట్ పాసింజర్ (58538), కొరాపుట్-విశాఖ పాసింజర్ (58587), విశాఖ -రాయపూర్ పాసింజర్ (58528), రాయపూర్-విశాఖ పాసింజర్ (58527), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531), విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్- విశాఖ పాసింజర్ (58505), విశాఖ-భవానిపాట్న పాసింజర్ (58504), భవానిపాట్న-విశాఖ పాసింజర్ (58503), విశాఖ-విజయనగరం పాసింజర్ (67287), విజయనగరం-విశాఖ పాసింజర్ (67288), విశాఖ-పలాస పాసింజర్ (67289), పలాస-విశాఖ (67290), విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), బ్రహ్మపూర్- విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), జూన్ 2న బ్రహ్మపూర్ -విశాఖ పాసింజర్ (58531), భవానిపాట్న-విశాఖ పాసింజర్ (58503), బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525) రద్దయ్యాయన్నారు.

ముమ్మరంగా యోగా సాధన



జీవీఎంసీ కల్యాణ మండపంలో సాధన చేస్తున్న సచివాలయ సిబ్బంది

మాధవధార, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ కార్యదర్శుల శిక్షణ కొనసాగుతోంది. జీవీఎంసీ మాధవస్వామి కల్యాణ మండపంలో 9 వార్డుల సచివాలయ సిబ్బందికి యోగా సాధనలో శిక్షణ ఇస్తున్నారు. రెండో రోజు శుక్రవారం ఈ శిక్షణను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జోన్-5 జెడ్సీ బి.రాము, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, పెద్దసంఖ్యలో రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు.

హెచ్‌ఎంగా శ్రీనివాసరావు

కంచరపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కప్పరాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా రాపర్తి శ్రీనివాసరావు వచ్చారు. గతంలో ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన శ్రీనివాసరావు ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా కప్పరాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపౌట్స్‌ను తగ్గించి పాఠశాలలో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు నేడు శ్రీకారం

మురళీనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లో ఎదురవుతున్న విద్యుత్ సరఫరా సమస్యలకు ముగింపు పలికేలా కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. శనివారం ఈ పనులను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు వైశాఖీ పార్కు సమీపంలో భూమిపూజ చేయనున్నట్లు బీజేపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నగరంలో తృప్తి క్యాంటీన్లు

(3వ పేజీ తరువాయి)

ఇచ్చిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకపోతే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలపాలని డిమాండ్ చేయడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. అలాగే 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 87వ వార్డు బొండా జగన్ కూడా తమ వార్డులకు సంబంధించిన పలు అంశాలను అజెండాలో చేర్చాలని పట్టుబడుతున్నారు. దీంతో శుక్రవారమే అజెండా కాపీలను కార్పొరేటర్లకు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ సాయంత్రానికి కూడా వారికి చేరకపోవడంతో చర్చకు దారితీసినట్టయింది. ఆయా అంశాలను అనుబంధ అజెండాలో చేర్చుతారా? లేకపోతే 27 అంశాలతోనే అజెండాను ఖరారు చేస్తారా? అనేదానిపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

సమ్మెపై చర్చలకు ఉక్కు యాజమాన్యం డుమ్మా

(3వ పేజీ తరువాయి)

సమ్మె ప్రభావం ప్లాంటుపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అడ్మిన్ భవనం వద్ద ఈ నెల 27, 28 తేదీల్లో భారీ ఎత్తున మోహరించి ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని లేఖలో పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్లాంటుకు రక్షణ కల్పించడంతో పాటు ఉత్పత్తికి విఘాతం కలగకుండా వివిధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగిస్తున్నామని, వారంతా రోజుకు 12 గంటలు పనిచేస్తున్నారని, అంతా ఆయా విధుల్లో తీరిక లేకుండా ఉన్నందున చర్చలకు రాలేకపోతున్నామని, చర్చలకు మరో తేదీని సూచించాలని కోరింది. అయితే చర్చలకు వస్తే.. తీసేసిన కార్మికులకు గంగవరం పోర్టు మాదిరిగా నష్టపరిహారం కోరాలని భావించిన కాంట్రాక్టు కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కాగా ఆర్ఎల్‌సీ జూన్ 10న మరోసారి చర్చలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ప్రజాప్రతినిధులను కలుస్తాం: కాంట్రాక్టు కార్మికులు

ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టు కార్మికులు మాట్లాడుతూ పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తన మొండి పట్టుదలను వీడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి పరిష్కారం కోరుతామని వారు తెలిపారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

(3వ పేజీ తరువాయి)

రాష్ట్రపతి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గంగుండా సాగరతీరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్‌కు వస్తారన్నారు. అక్కడ జరిగే స్నాతకోత్సవంలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఆమె పాల్గొంటారన్నారు. అనంతరం రోడ్డు మార్గం గుండా విమానాశ్రయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, విమానాశ్రయం నుంచి బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్ వరకు సుందరీకరణ పనులుతో పాటు రహదారులకు మరమ్మతులను చేపట్టాలన్నారు. జ్ఞానాపురం రైల్వే అండర్ పాస్‌వే వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఒకవేళ వర్షం పడితే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలన్నారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాల్ వరకు ఎలాంటి హోర్డింగ్‌లు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రపతితోపాటు గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న నేపథ్యంలో ప్రత్యేక గ్రీన్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, ఏయూ కన్వెన్షన్ హాల్ వద్ద పారిశుధ్యపరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిపుణులతో కూడిన వైద్య బృందం, అత్యాధునికైన అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడంతో పాటు పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, డీఆర్‌వో బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

రేపటి నుంచే రేషన్ డిపోల వద్ద సరకులు

(3వ పేజీ తరువాయి)

కార్డులు ఉన్నాయి. ప్రతినెలా వీరికి ఎనిమిది వేల టన్నుల బియ్యం, 245 టన్నుల పంచదార పంపిణీ చేస్తున్నారు. కార్డుదారులు తమ పరిధిలోని డిపోలకు వెళ్లి సరకులు తీసుకునేలా ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచే సరకులను పంపిణీ చేసేందుకు గాను రేషన్ డిపోలను అందంగా తీర్చిదిద్దాలని డీలర్లకు ఆదేశాలిచ్చారు. ప్రత్యేకించి డిపో ముందు బోర్డు ఏర్పాటు చేసి డిపో నంబర్, డీలర్ పేరు, ఏరియా పేరు, సర్కిల్ నంబర్, స్టాకు వివరాల మొత్తాన్ని బోర్డులో పొందుపరిచేలా చేశారు. ఒకటో తేదీన ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను పిలిచి కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశించారు. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు రేషన్ డిపోలను తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్, జిల్లా పరిశీలకుడు, పౌరసరఫరాలశాఖ డీడీ భగన్నారాయణలు నగరంలోని పలు డిపోలను సందర్శించి డీలర్లకు సూచనలు చేశారు. ప్రతి డిపోలో రికార్డులు, ఈపోస్ మిషన్లు తనిఖీ చేసి అవసరమైన సూచనలు ఇచ్చారు. కేటాయించిన సమయాలను పాటించాలని, తూకంలో తేడాలు వద్దని, ప్రతిఒక్కరికీ ఈపోష్ మిషన్ నుంచి రసీదు ఇవ్వాలని వివరించారు. ప్రతి డిపోలో తాగునీటి సదుపాయం కల్పించాలని, కార్డుదారులకు కూర్చునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సరకుల పంపిణీలో తేడాలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే సరకులు ఇవ్వాలన్న ఆదేశాల మేరకు జిల్లాలో అటువంటివారు 32,701 మంది ఉన్నట్టు గుర్తించారు. సర్కిల్-1లో 8,672 మంది, సర్కిల్-1లో 8,200, సర్కిల్-3లో 7,891, భీమిలి మండలంలో 3,091, పద్మనాభంలో 2,023, ఆనందపురంలో 1,852, పెందుర్తిలో 972 మంది ఉన్నారు. వీరికి ఇళ్ల వద్దు సరకుల పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఆదివారం నుంచి చేపట్టే సరకుల పంపిణీలో ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు జేసీ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లాలో ఎండీయూ ఆపరేటర్లు అందజేసిన ఈ-పోస్ మిషన్లకు పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మరమ్మతులు చేసి డీలర్లకు అందజేస్తున్నారు. కార్డుదారులకు రసీదులు ఇచ్చేందుకు వీలుగా పేపర్ రోల్స్‌ను డీలర్లకు సరఫరా చేశారు.

మసాజ్ సెంటర్లపై సీపీ కన్ను!

(3వ పేజీ తరువాయి)

చేయడాన్ని పోలీసులు అనుమతించరు. మసాజ్ సెంటర్/స్పాలలో పురుషులకు, మహిళలకు వేర్వేరు సెక్షన్లను ఏర్పాటు చేయాలి. లోపలకు ప్రవేశించడానికి ఒక మార్గం, బయటకు వెళ్లేవారికి ఒక మార్గం వేర్వేరుగా ఉండాలి. వారికి టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు కూడా వేర్వేరుగా ఉండడంతో పాటు లోపల ఒక గది నుంచి మరొక గదిలోకి వెళ్లేలా అంతర్గత ద్వారాలు ఉండకూడదు. సెంటర్‌లోకి అడుగుపెట్టిన వారికి ప్రతీదీ కనిపించేలా ఉండే ట్రాన్స్‌ప్రింట్ అద్దాలను మాత్రమే ఏర్పాటు చేయాలి. పదిమంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నట్టయితే వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వడం, మహిళా సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగం వంటివి అందుబాటులో ఉంచాలి. మసాజ్ సెంటర్/స్పాలలో ఫిజియోథెరపిస్టు లేదా ఆక్యుప్రెజర్ లేదా ఆక్యూపేషనల్ థెరపీలో డిగ్రీ, డిప్లొమా లేదంటే సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లను మాత్రమే నియమించుకోవాలి. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే వీటిని తెరిచి ఉంచాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను వీడియో రికార్డు చేసేలా అన్నిచోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు కనీసం మూడు నెలల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్ డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి. కానీ నగరంలోని మసాజ్ సెంటర్/స్పాల్లో మాత్రం ఈ నిబంధనలేవీ మచ్చుకైనా అమలు కావడం లేదనేది నేడి బహిరంగ రహస్యం.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

నగరంలోని మసాజ్ సెంటర్‌లు/స్పాలలో ఒకటి, రెండు మినహా మిగిలిన వాటన్నింటిలోనూ క్రాస్ జెండర్ మసాజ్‌లు, వ్యభిచారం వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. థాయ్‌లాండ్, కేరళ, గోవా వంటి ప్రాంతాల నుంచి యువతులను నగరానికి తెప్పించి వారితో మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నాళ్ల కిందట నగరంలోని మసాజ్ సెంటర్లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా థాయ్‌లాండ్‌కు చెందిన యువతులు స్పా సెంటర్లలో ఎటువంటి అనుమతి లేకుండా పనిచేస్తున్నట్టు గుర్తించారు. అలాగే కొన్ని సెంటర్లలో వాడిపడేసిన కండోమ్‌లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. సెంటర్లలో పనిచేస్తున్న వారిలో మసాజ్ గురించి అవగాహన లేని యువతులే పనిచేస్తున్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు మసాజ్ సెంటర్ల నిర్వాహకులను పిలిచి ఆయా సెంటర్లకు సంబంధించిన నియమ నిబంధనలు, పాటించాల్సిన జాగ్రత్తలు, ఉల్లంఘించిన వారిపై తీసుకునే చర్యలు, ఎదురయ్యే శిక్షల గురించి వివరించారు. అయినప్పటికీ వారిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ ఒక్కో మసాజ్ సెంటర్ స్థాయిని బట్టి సగటున రూ.పది వేల చొప్పున నెలనెలా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు చేరిపోతోందని, అందువల్లే చర్యలు ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జంబ్లింగ్ తనిఖీలతో అక్రమాలకు చెక్

మసాజ్ సెంటర్ల నిర్వాహకులతో పలువురు పోలీసులు అవగాహన ఏర్పరుచుకున్నారని సీపీ శంఖబ్రత బాగ్చికి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ఆదేశాలతో సిబ్బంది నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే సమాచారం సీపీకి చేరింది. పోలీసులు మసాజ్ సెంటర్లు/స్పాల నిర్వాహకులతో మిలాఖత్ కావడంతో దాడులు చేసినప్పుడు ముందుగానే వారికి సమాచారం అందజేసి అప్రమత్తం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందువల్లే తనిఖీల సమయంలో పోలీసులు తమకు ఎలాంటి ఉల్లంఘనలు కనిపించలేదని నివేదిక ఇస్తున్నారని సీపీ భావిస్తున్నారు. ఇకపై దీనికి అడ్డుకట్ట వేయాంటే తరచూ మసాజ్ సెంటర్లు/స్పాలపై దాడులు నిర్వహించాల్సిందేనని భావిస్తున్నారు. అలా దాడులు చేసినప్పుడు ఒక స్టేషన్ పరిధిలోని మసాజ్ సెంటర్‌లు/స్పాలలో తనిఖీలు చేసేందుకు వేరే పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బందికి బాధ్యతలు (జంబ్లింగ్) అప్పగించడం వల్ల అక్రమార్కులు తప్పించుకునే అవకాశం ఉండదని సీపీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ విధానంలో మసాజ్ సెంటర్లు/స్పాలలో తనిఖీలకు శ్రీకారం చుడతామని ఆయన తెలిపారు.

చెరువును తలపించిన పెదగదిలి జంక్షన్

» భారీ వర్షంతో వాహనదారుల ఇబ్బందులు
» కాలువల ఆధునికీకరణ చేపట్టాలంటున్న స్థానికులు, వాహనదారుల వినతి

ఆరిలోవ, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెదగదిలి జంక్షను వరదనీటిమయం అయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. సాధారణంగా చిన్నపాటి వర్షం వస్తేనే ఈ జంక్షనులో వర్షం నీరు నిలిచిపోతుంది. అలాంటిది శుక్రవారం జోరు వాన కురవడంతో జంక్షను తటాకాన్ని తలపింపజేసింది. కాలువలు చిన్నవి కావడం వల్ల మురుగు నీరు రోడ్లపైకి చేరింది. కొండవాలు ప్రాంతం కావడంతో వాడుక నీటితో పాటు వరదనీరు విపరీతంగా చేరింది. పల్లపు ప్రాంతం అవడం వల్ల జంక్షనులో అధికంగా వర్షం నీరు చేరి చాలాసేపు నిలిచిపోయింది. కాలువల్లో పూడికలు నిండిపోవడంతో వర్షం నీరు సకాలంలో పారే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా వాన వెలసిన తర్వాత వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. ముఖ్యంగా.. ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు.

ఈ ప్రాంతంలో కాలువలు చిన్నవిగా ఉండడంతో పాటు అందులో పూడికను తొలగించకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి నీరు నిలిచిపోయి చెరువులా తయారవుతోంది. ప్రతిసారి ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నటికీ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కాలువలు వెడల్పు చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారే లేరని ఆరోపిస్తున్నారు. ఇలా వర్షం వచ్చినపుడు నీరు నిలిచిపోయి అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువులా తయారైన పెదగదిలి జంక్షన్‌లో వాహనదారుల అవస్థలు

నీరు నిలిచిపోవడంతో తోపుడు బండ్ల వ్యాపారులు, ఫ్లాట్‌ఫామ్స్‌పై కూరగాయలు విక్రయించేవారు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. హనుమంతవాక జంక్షను సిగ్నల్‌పాయింట్ నుంచి పెదగదిలి వచ్చే మార్గంలో కూడా వరద నీరు నిలిచి పోతోంది. పెదగదిలిలో గల చిల్డ్రన్ పార్కులో కూడా నీరు నిలిచిపోయింది. దీంతో కొన్ని రోజుల పాటు పార్కులోకి చిన్నారులు వెళ్లడానికి వీలు లేని పరిస్థితి నెలకొందివర్షాకాలం నేపథ్యంలో ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడ కాలువల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

స్వయంశక్తి సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రణాళికలు

కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ, మండల పరిషత్ ప్రతినిధులు, అధికారులు



సమావేశంలో పాల్గొన్న కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో స్వయంశక్తి సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రణాళికలు అమలుచేయాలని కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. శుక్రవారం రాడిసిన్‌బ్లూ హోటల్‌లో పంచాయతీ, మండల పరిషత్ ప్రతినిధులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ స్వయంశక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించిన పంచాయతీల లో సంఘాలకు లాభదాయకమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రణాళికలు పక్కాగా అమలుచేయాలన్నారు. సదస్సు నిర్వహణలో భాగంగా ఎంపిక చేసిన 88 మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. సదస్సులో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, పలువురు జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట పెట్రోలు బంకు వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శివాజీపాలేనికి చెందిన పాతరపల్లి వెంకటరమణ శాంత్యాంలో టిఫిన్ మాస్టరుగా పని చేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో విధి నిర్వహణకు బయలుదేరి ఇసుకతోట బస్టాపు వైపు నడిచి వెళ్లాడు. జాతీయ రహదారిపై అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. టిఫిన్ సెంటరు యజమాని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, వెంకటరమణ పనికి రాలేదని చెప్పడంతో, భార్య కొండమ్మ, వెంకటరమణ ఫోన్‌కు ప్రయత్నించగా, ఎంవీపీ పోలీసులు లిఫ్ట్‌చేసి, సదరు వ్యక్తికి ప్రమాదం జరిగిందని సమాచారం ఇచ్చారు. కొండమ్మ ఫిర్యాదు మేరకు ఎంవీపీ ఏఎస్‌ఐ సత్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌత్ ఇండియా కరాటే పోటీలకు ఎంపికలు



కరాటే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఎంవీపీ కాలనీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1న ఎంవీపీ కాలనీ అప్పుఘర్ పోలమాంబ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న సౌత్ ఇండియా ఓపెన్ చాంపియన్‌షిప్ కరాటే పోటీలకు బ్రూస్‌లీ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ తరపున క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించినట్టు ఆ సంస్థ వ్యవస్థాపక చీఫ్ కోచ్ చిన్నా తెలిపారు. బాలికల విభాగంలో 12 ఏళ్ల విభాగంలో తేజస్విని, 13 ఏళ్ల విభాగంలో జీవీ ఆరాధ్య, 16 ఏళ్ల విభాగంలో కావ్య, 17 ఏళ్ల విభాగంలో సౌమ్య, బాలురలో 12 ఏళ్ల విభాగంలో తనుష్, 13 ఏళ్ల విభాగంలో మనోజ్ యాదవ్ ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గౌరీ ప్రియ, వైభవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం'

ఉక్కుటౌన్‌షిప్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, యాజమాన్యాలు అనుసరిస్తున్న నిరంకుశవిధానాలు, నిర్బంధాలపై ఐక్య పోరాటాలు చేయాలని స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భవ దినోత్సవాన్ని శుక్రవారం ప్లాంటు అడ్మిన్ భవనం మార్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ఐక్యతను విచ్ఛిన్నం చేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.

సినిమా గైడ్

● **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కరాటే కిడ్** : శారద
● **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
● **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
● **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
● **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 20, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయాలు

» కబేలాలో అనుమతి పొందకుండా యథేచ్ఛగా అమ్మకాలు
» పట్టించుకోని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు



కబేలా స్టాంపు లేకుండా వధించిన మేకను మాంసం విక్రయానికి ఉంచిన దృశ్యం

ఆరిలోవ, మే 30 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మటన్ విక్రయ కేంద్ర వద్ద నిబంధనలు పాటించకుండా మాంసం విక్రయాలను చేపడుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసి కబేలాలో అనుమతి స్టాంపులు లేకుండా ఈ జంక్షన్‌లో యథేచ్ఛ మాంసం విక్రయాలు చేపడుతున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నగరంలో మటన్ అమ్మే వారంతా జీవీఎంసీ కబేలాలో అనుమతి పొందాల్సి ఉంటుంది. మటన్ కోసం బలి ఇచ్చే జంతువును కబేలాలో పశువైద్యులు పరిశీలించి, అంతా సరిగా ఉంటేనే అనుమతి ఇస్తారు. ఇందుకోసం సదరు జంతువు వధించిన తర్వాత దానిపై స్టాంపును వేస్తారు. ఆ జంతువుకు సంబంధించిన మాంసాన్ని మాత్రమే విక్రయించాలి. అయితే ఇక్కడ మాంసం వ్యాపారులు అవేవీ పాటించడం లేదని, కబేలాకు తరలించకుండా సొంతంగా మేకలు, గొర్రెలను చంపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల శుచి, శుభ్రత లేని మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారని పలువురు కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉంచి మాంసం కూడా విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇక్కడి మాంసం వ్యాపారులది 'ఆడిందే ఆట..' చందంగా పరిస్థితి తయారైందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో మాంసం వ్యాపారాలపై జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

'దళితుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు'

సింధియా, మే 30, (ఆంధ్రజ్యోతి) : దళితుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ జంక్షన్‌లో గురువారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా దళిత నాయకులు సాంబమూర్తి, కామేశ్వరరావు, అప్పారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చిత్రకళా ప్రతిభకు తార్కాణం స్పెక్ట్రమ్

» ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులకు ఏయూ వీసీ రాజశేఖర్ ప్రశంస



ప్రదర్శనలో ఉంచిన శిల్పాలను తిలకిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అద్భుత ప్రతిభకు ప్రత్యక్ష తార్కాణంగా స్పెక్ట్రమ్ ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం బీఎఫ్‌ఏ, ఎంఎఫ్‌ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన స్పెక్ట్రం-2025ను ఆయన శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన శిల్పాలు, చిత్రాలను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ విస్తృత స్థాయిలో ఒక ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని వీసీ రాజశేఖర్ సూచించారు. విద్యార్థులు రూపొందించిన శిల్పాలు, పెయింటింగ్‌లను నిశితంగా పరిశీలించి వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతికత, కళ మిళితం చేస్తూ విద్యార్థులు తీర్చిదిద్దిన కళారూపాలను ఎంతగానో బాగున్నాయంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ఆకృతులు పరిశీలించి విద్యార్థులతో ముచ్చటిస్తున్న వీసీ

కార్మిక లేబర్ కోడ్స్ రద్దుకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్కెఎస్వీ కుమార్

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను మరింత బానిసలుగా చేస్తోందన్నారు. ఈ లేబర్ కోడ్స్‌కు రద్దుకు జూలై 9న చేపట్టే సమ్మెతో సిద్ధం కావాలన్నారు. కార్మికవర్గం ఐక్యంగా కదిలి హక్కులను కాపాడుకోవాలన్నారు. సీఐటీయూ ఆవిర్భవించిన 55 ఏళ్లలో అనేక పోరాటాలు చేసి కార్మికులకు అండగా నిలిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా కార్మిక హక్కులు, సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించామన్నారు. కార్మిక చట్టాలు, పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, గ్రాడ్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, కార్మిక హక్కులపై సుదీర్ఘ పోరాటాలు చేస్తూ అన్ని రంగాల్లో సీఐటీయూ విస్తరించిందన్నారు. ప్రభుత్వం కార్మికు వ్యతిరేక విధానాలకు పాల్పడిన ప్రతిసారి కార్మిక సంఘాలను ఐక్యం చేస్తూ దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తోందన్నారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.వెంకటరావు, కృష్ణారావు, పి.రాజు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు కార్మికుల సమ్మెపై పోలీసుల నిర్బంధం తగదు : సీఐటీయూ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, కార్యకర్తలు

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై పోలీసులు నిర్బంధం ఆపి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను నిర్బంధించడానికి నిరసనగా శుక్రవారం మద్దిలపాలెంలో సీఐటీయూ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని 1560 రోజుల నుంచి నిరహారదీక్షలు చేస్తున్నామన్నారు. కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కాపాడడానికి, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు, ప్లాంట్‌కు ముడి సరుకు కొనుగోలుకు వాడలేదని, అప్పులు, వడ్డీలు, జీఎస్టీలు చెల్లించడానికే వాడారని విమర్శించారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్‌మంగళం, డి.అప్పలరాజు, పి.వెంకట్రావు, కృష్ణారావు, నరేంద్రకుమార్, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, ఆరోగ్య పరిరక్షణ

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



యోగాసనాలు వేస్తున్న కృష్ణా కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఏకగ్రతతో పాటు మానసిక ఉల్లాసం పెంచుకోవచ్చని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రాధాన్యత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగా చేయడాన్ని విధిగా అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా 'ఒక భూమి.. ఒక ఆరోగ్యం కోసం యోగా' అనే థీమ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనిపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ తీసుకున్న దత్తత గ్రామాల్లో యోగా ప్రాధాన్యాన్ని వివరించే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే కళాశాలలో యోగాపై వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహిస్తామని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. జాతీయ సేవా పథకం జోనల్ అధికారి పి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ యోగాసానాల అలవాటు చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని, అందుకే అందరు రోజుకు గంట రెండు గంటల పాటు యోగాసనాలు వేయాలన్నారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులు యోగాసానాలు వేశారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు కుసుమకుమారి, జీవీ ప్రతాప్, బి.లక్ష్మీ, బి.నాగేశ్వరరావు, సంధ్యారాణి, రవిబాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం విజయవంతం చేయండి

» వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పలువురు వైసీపీ నేతలు

మద్దిలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ఏడాది పూర్తి చేసినందుకు నిరసనగా ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి పార్టీలు సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికల్లో ప్రచారం చేసి గెలుపొందాయన్నారు. అధికారం వచ్చాక హామీలను నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

'పొగాకుకు దూరంగా మెలగాలి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ఆరిలోవ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో నోటి క్యాన్సర్ కేసులలో దాదాపు మూడింట ఒక వంతు భారతదేశంలో కనిపిస్తున్నాయని అపోలో వైద్య బృందం పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆరిలోవ హెల్త్ సిటీలో గల అపోలో వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ఏటా 77 వేల కొత్త కేసులు బయట పడుతుండగా, 52 వేల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో పొగాకు వినియోగం ఎక్కుగా ఉండడంతో ఇక్కడ కేసుల రేటు కూడా అధికంగా ఉంటోందన్నారు. పొగాకు వాడకం వల్ల నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉందన్నారు. కాబట్టి పొగాకుకు దూరంగా ఉండడమే ఉత్తమమని సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు కృష్ణ నేటి తరం నటీనటులకు ఆదర్శనీయమని ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన డాబాగార్డెన్స్ పల్లవి మ్యూజిక్ కార్యాలయం ఆవరణలో సూపర్ స్టార్ కృష్ణ 60 వసంతాల సినీ వజ్రోత్సవంలో భాగంగా 82వ జయంతి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 31న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు సంస్థ అధినేత పల్లా బాబ్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, డా.టి.కుమార్‌రాజు, వ్యాఖ్యాత లక్ష్మీ స్వరూప, ఎ. వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి సునీల్‌కుమార్‌కు సన్మానం



సభలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్ కుమార్

జ్ఞానాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : చిత్తశుద్ధితో పని చేయడంతో పాటు సౌమ్యశీలిగా అందరి మన్ననలు పొందిన అధికారి డాక్టర్ సునీల్ కుమార్ అని జోనల్ కమిషనర్ బి. రాము కొనియాడారు. జోన్-5 కార్యాలయంలో సహాయ వైద్యాధికారిగా పని చేసిన సునీల్‌కుమార్ పదోన్నతిపై ఈఎన్‌టీ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయనకు శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. జడ్సీ , తదితరులు సునీల్‌కుమార్‌ను సన్మానించి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సర్వే

జ్ఞానాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధిలో చేపడుతున్న వీధి విక్రయదారుల సర్వేకు సహకరించాలని జోనల్ కమిషనర్ బి. రాము శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయాల పరిధిలో వెల్ఫేర్ కార్యదర్శులకు వివరాలు తెలియజేయాలని కోరారు. సర్వేలో నమోదైన వారికి ప్రభుత్వం వెండర్ కార్డు, సర్టిఫికెట్లు జారీ చేస్తుంద న్నారు. జోన్ పరిధిలో 7300 మంది వ్యాపారులు ఉండగా ఇప్పటివరకు 1300 మంది మాత్రమే సర్వేలో పాల్గొన్నారని తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారం

మహారాణిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలతో అధికారులు సమన్వయంతో వ్యవహరించి వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పేలా ప్రోత్సహించాలని కోరారు.

విద్యుత్ సరఫరా మెరుగుకు కసరత్తు

(3వ పేజీ తరువాయి)

తెలియజేస్తున్నారు. ఎలమంచిలిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఈ పనులు నిర్వహించడానికి గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకు, ఆ తరువాత మళ్లీ 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం సుమారు ఏడు గంటల పాటు పనులు చేపట్టారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ముందుగానే ప్రకటించారు. అయితే రాత్రి 7.30 గంటల వరకు పనులు జరగడం వల్ల మరో రెండు గంటలు అదనంగా సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. టవర్ల పైనుంచి విద్యుత్ వైర్లను లాగడం వల్ల ఎక్కువ సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఈ పనులు చేపట్టడం వల్ల వచ్చే పదేళ్ల వరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతామని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రతి శుక్రవారం నిర్వహణ పనుల కోసం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని, ఇప్పుడు కొత్త పనులు చేపట్టడం వల్ల ఇంకో రోజు ఆగుతోందని వివరించారు. డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా ఉందని, పనులు పూర్తయిన తరువాత 24/7 సరఫరా జరుగుతుందన్నారు.

రాత్రిపూట తీరం కాంతివంతంగా ఉండాలి

మేయర్ పీలా శ్రీనివాసరావు



ఆర్కే బీచ్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరానికి మణిహారమైన బీచ్ అందాలను నగరవాసులు, పర్యాటకులు రాత్రి పూట ఆస్వాదించేందుకు వీలుగా సముద్ర తీరం కాంతులీనేలా చర్యలు చేపట్టాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జూన్ 21న తీరంలో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో జరిగే యోగా డే వేడుకల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మేయర్ శుక్రవారం రాత్రి ఆర్కే బీచ్ నుంచి తెన్నేటి పార్కు వరకు తీరంలోని పరిస్థితులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తీరంలో లైటింగ్ సరిగ్గా లేకపోవడం, అక్కడక్కడ ఉన్న విద్యుత్ దీపాలు కాంతివంతంగా లేకపోవడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బీచ్ ఒడ్డున గట్టుపై కూర్చునే వారికి సముద్రపు అలలు, ఇసుకతెన్నెలు స్పష్టంగా కనిపించేలా ఎక్కడికక్కడ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యుత్ బల్బుల స్థానంలో అధిక కాంతిని వెదజల్లే అత్యాధునికమైన లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల బీచ్ అందాలను రాత్రివేళ సందర్శకులు వీక్షించడానికి అవకాశం కల్పించడంతోపాటు బీచ్‌లో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మత్తు మందు సేవించే బ్యాచ్‌లకు అడ్డుకట్ట పడుతుందన్నారు. రోప్‌వే నుంచి సీతకొండ వరకు తీరాన్ని అభివృద్ధి చేసినా లైటింగ్ సరిగ్గా లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయిందన్నారు. తెన్నేటి పార్కు వద్ద చిరుతిళ్లు విక్రయించే వారి స్టాల్స్ వద్దకు వెళ్లి వారు విక్రయించే ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రతీ వ్యాపారి దుకాణం పక్కనే డస్ట్‌బిన్లను పెట్టుకుని, బీచ్‌ను సుందరంగా ఉంచడానికి సహకరించాలని సూచించారు. తీరం వెంబడి సాయంత్రంవేళ క్రీడాకారులు సాధన చేసేందుకు వీలుగా అవకాశం ఉన్నచోట కోర్టులు ఏర్పాటు చేయడంతోపాటు లైటింగ్ సదుపాయం కల్పించే అంశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. మేయర్ వెంట జెడ్సీ శివప్రసాద్, ఈఈ శ్రీధర్, డీఈ అన్నమనాయుడు, తదితరులు ఉన్నారు.

యోగా విజయవంతానికి ప్రణాళిక అవసరం : కలెక్టర్

మహారాణిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు, పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే వేదికలతో పాటు అనువైన ప్రాంతాల్లో మరో 25 వేదికలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వాటి వద్ద మౌలిక వసతులతో పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ ప్రాంతం వారు ఆ కంపార్ట్‌మెంట్‌కు చేరుకోవాలి, ఏ వాహనం ఎక్కడికి చేరుకోవాలి అన్న అంశాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రధాన వేదికతో పాటు ఎంజీఎం గౌండ్. వీఎంఆర్‌డీఏ పార్కు, అప్పుఘర్, ఎగ్జిబిషన్ గౌండ్, రామా నాయడు స్టూడియో కింద విశాఖ వ్యాలీ రోడ్డు, భీమిలీ హౌసింగ్ బోర్డు లేఅవుట్, ఐఎన్ఎస్ కళింగ మైదానంలో యోగాసనాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. ఆయా ప్రాంత కార్యక్రమాలను ప్రధాన వేదికకు అనుసంధానం చేస్తూ ప్రజలను భాగస్వా మ్యం చేయాలని అధికారులకు సూచించారు. కాగా తొట్ల కొండపై జూన్ 1న యోగాంధ్రా నిర్వహించనున్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు యోగాసనాలు వేయనున్నారు. ఇండియన్ నేవీ యోగా అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధికారులు భాగస్వామ్యం కానున్నారు.

తెలంగాణ మాఫియా చేతిలో ఏపీలోని థియేటర్లు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు నారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు

డాబాగార్డెన్స్, మే 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు చెందిన కొంతమంది నిర్మాతల చేతిలో ఆంధ్రప్రదేశ్‌లో చలన చిత్ర పరిశ్రమ నలిగిపోతోందని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు జీఏ నారాయణరావు అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్యుడు థియేటర్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారని తెలిపారు. థియేటర్లలో సమోసా, పాప్‌కార్న్, వాటర్‌బాటిల్స్ కూల్‌డ్రింక్స్ ధరలను అత్యంత దారుణంగా పెంచి విక్రయిస్తున్నారన్నారు. దీంతో వినోదం కోసం వెళ్లిన ప్రేక్షకులకు చేతి చమురు వదులుతోందని విమర్శించారు. వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే థియేటర్లలో పారిశుధ్యం, పార్కింగ్ ఫీజుల రేట్లు తక్షణమే తగ్గించేలా చూడాలని కోరారు. పోరాట సమితి న్యాయవాదులు కాశీభట్ల స్వరూప్, పాకా సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయపరంగా వీటిపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏయూ ఉద్యమ సంఘం నాయకులు బొట్ల రామచంద్రయాదవ్, బీసీ రాష్ట్ర నాయకుడు తోట వాసుదేవరావు,సామాజిక వేత్త సీతారామస్వామి, మంత్రి రాజశేఖర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

(3వ పేజీ తరువాయి)



నగదు తీసుకున్న డీసీటీవో అనుచరుడు సన్యాసిరాజు

గోదాముకు చేరింది. అక్కడి నుంచి మెటీరియల్ తీసుకెళ్లడంలో విశ్వనాథ్ కొంత ఆలస్యం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న డీసీటీవో జయలక్ష్మి గోదామును తనిఖీ చేసి ప్లైఉడ్ మెటీరియల్‌ను పరిశీలించారు. దీనికి సంబంధించి క్యారియింగ్ ఇన్వాయిస్ లేకపోవడంతో సరకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో విశ్వనాథ్.. డీసీటీవో జయలక్ష్మిని కలిసి మెటీరియల్ రిలీజ్ చేయాలని కోరారు. రూ.30 వేలు లంచం ఇస్తేనే రిలీజ్ ఆర్డర్ ఇస్తానని ఆమె స్పష్టం చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని విశ్వనాథ్ ప్రాధేయపడగా.. రూ.25 వేలకు తగ్గించారు. లంచం సొమ్మును తన అనుచరుడైన కాశేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి మామిడిపాక సన్యాసిరాజుకు ఇవ్వాలని ఆమె సూచించారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని విశ్వనాథ్ గురువారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు శుక్రవారం ఉదయం వన్ టౌన్‌లోని గోదాము వద్ద సన్యాసిరాజుకు లంచం డబ్బులు ఇస్తుండగా.. అప్పటికే మాటు వేసి వున్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం సన్యాసిరాజును లంకెలపాలెంలో వున్న అచ్యుతాపురం సర్కిల్ డివిజన్-2 వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి డీసీటీవో జయలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. తరువాత కార్యాలయంలో తనిఖీలు చేసి, ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు సుప్రియ, శ్రీనివాస్, లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి వేదికపై కల్యాణ క్రతువు జరిపారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

కంచరపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి రాంజీ ఎస్టేట్‌లో గల లక్ష్మీగణపతి ఆలయం 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి విశిష్ట పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తనయ శ్యామలా దీపిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



ముగింపు శిబిరంలో ట్రోఫీతో విజేతలు

అక్కయ్యపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారం ఘనగా ముగిశాయి. రైల్వే మైదానంలో ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చి దిద్దడమే ప్రధాన ఉద్దేశంతో కేవలం రైల్వే ఉద్యోగుల పిల్లలకు మాత్రమే కాకుండా స్థానిక యువతకు శిక్షణ అవకాశం కల్పించామన్నారు. శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నీలో విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు.

రేపు పలు రైళ్లు రద్దు

అక్కయ్యపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, రాయగడ సెక్షన్‌లో నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు: జూన్ 1న విశాఖ-కొరాపుట్ పాసింజర్ (58538), కొరాపుట్-విశాఖ పాసింజర్ (58587), విశాఖ -రాయపూర్ పాసింజర్ (58528), రాయపూర్-విశాఖ పాసింజర్ (58527), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531), విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్- విశాఖ పాసింజర్ (58505), విశాఖ-భవానిపాట్న పాసింజర్ (58504), భవానిపాట్న-విశాఖ పాసింజర్ (58503), విశాఖ-విజయనగరం పాసింజర్ (67287), విజయనగరం-విశాఖ పాసింజర్ (67288), విశాఖ-పలాస పాసింజర్ (67289), పలాస-విశాఖ (67290), విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), బ్రహ్మపూర్- విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), జూన్ 2న బ్రహ్మపూర్ -విశాఖ పాసింజర్ (58531), భవానిపాట్న-విశాఖ పాసింజర్ (58503), బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525) రద్దయ్యాయన్నారు.

ముమ్మరంగా యోగా సాధన



జీవీఎంసీ కల్యాణ మండపంలో సాధన చేస్తున్న సచివాలయ సిబ్బంది

మాధవధార, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ కార్యదర్శుల శిక్షణ కొనసాగుతోంది. జీవీఎంసీ మాధవస్వామి కల్యాణ మండపంలో 9 వార్డుల సచివాలయ సిబ్బందికి యోగా సాధనలో శిక్షణ ఇస్తున్నారు. రెండో రోజు శుక్రవారం ఈ శిక్షణను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జోన్-5 జెడ్సీ బి.రాము, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, పెద్దసంఖ్యలో రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు.

జ్ఞానాపురంలో భారీ వర్షం



జ్ఞానాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కాన్వెంటు కూడలి, వెజిటేబుల్ మార్కెట్, డాల్ఫిన్ హోటల్ రోడ్డు తదితర ప్రాం తాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం పడింది. చావులమదుం బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది నీటిలోనించి వాహనాలను తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు.

హెచ్ఎంగా శ్రీనివాసరావు

కంచరపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కప్పరాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా రాపర్తి శ్రీనివాసరావు వచ్చారు. గతంలో ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేసిన శ్రీనివాసరావు ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా కప్పరాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపౌట్స్‌ను తగ్గించి పాఠశాలలో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు నేడు శ్రీకారం

మురళీనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లో ఎదురవుతున్న విద్యుత్ సరఫరా సమస్యలకు ముగింపు పలికేలా కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. శనివారం ఈ పనులను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు వైశాఖీ పార్కు సమీపంలో భూమిపూజ చేయనున్నట్లు బీజేపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నగరంలో తృప్తి క్యాంటీన్లు

(3వ పేజీ తరువాయి)

ఇచ్చిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకపోతే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలపాలని డిమాండ్ చేయడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. అలాగే 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 87వ వార్డు బొండా జగన్ కూడా తమ వార్డులకు సంబంధించిన పలు అంశాలను అజెండాలో చేర్చాలని పట్టుబడుతున్నారు. దీంతో శుక్రవారమే అజెండా కాపీలను కార్పొరేటర్లకు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ సాయంత్రానికి కూడా వారికి చేరకపోవడంతో చర్చకు దారితీసినట్టయింది. ఆయా అంశాలను అనుబంధ అజెండాలో చేర్చుతారా? లేకపోతే 27 అంశాలతోనే అజెండాను ఖరారు చేస్తారా? అనేదానిపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

సమ్మెపై చర్చలకు ఉక్కు యాజమాన్యం డుమ్మా

(3వ పేజీ తరువాయి)

సమ్మె ప్రభావం ప్లాంటుపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అడ్మిన్ భవనం వద్ద ఈ నెల 27, 28 తేదీల్లో భారీ ఎత్తున మోహరించి ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని లేఖలో పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్లాంటుకు రక్షణ కల్పించడంతో పాటు ఉత్పత్తికి విఘాతం కలగకుండా వివిధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగిస్తున్నామని, వారంతా రోజుకు 12 గంటలు పనిచేస్తున్నారని, అంతా ఆయా విధుల్లో తీరిక లేకుండా ఉన్నందున చర్చలకు రాలేకపోతున్నామని, చర్చలకు మరో తేదీని సూచించాలని కోరింది. అయితే చర్చలకు వస్తే.. తీసేసిన కార్మికులకు గంగవరం పోర్టు మాదిరిగా నష్టపరిహారం కోరాలని భావించిన కాంట్రాక్టు కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కాగా ఆర్ఎల్‌సీ జూన్ 10న మరోసారి చర్చలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ప్రజాప్రతినిధులను కలుస్తాం: కాంట్రాక్టు కార్మికులు

ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టు కార్మికులు మాట్లాడుతూ పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తన మొండి పట్టుదలను వీడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి పరిష్కారం కోరుతామని వారు తెలిపారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

(3వ పేజీ తరువాయి)

రాష్ట్రపతి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గంగుండా సాగరతీరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్‌కు వస్తారన్నారు. అక్కడ జరిగే స్నాతకోత్సవంలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఆమె పాల్గొంటారన్నారు. అనంతరం రోడ్డు మార్గంగుండా విమానాశ్రయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, విమానాశ్రయం నుంచి బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్ వరకు సుందరీకరణ పనులుతో పాటు రహదారులకు మరమ్మతులను చేపట్టాలన్నారు. జ్ఞానాపురం రైల్వే అండర్ పాస్‌వే వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఒకవేళ వర్షం పడితే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలన్నారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాల్ వరకు ఎలాంటి హోర్డింగ్‌లు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రపతితోపాటు గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న నేపథ్యంలో ప్రత్యేక గ్రీన్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, ఏయూ కన్వెన్షన్ హాల్ వద్ద పారిశుధ్యపరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిపుణులతో కూడిన వైద్య బృందం, అత్యాధునికైన అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడంతో పాటు పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

రేపటి నుంచే రేషన్ డిపోల వద్ద సరకులు

(3వ పేజీ తరువాయి)

కార్డులు ఉన్నాయి. ప్రతినెలా వీరికి ఎనిమిది వేల టన్నుల బియ్యం, 245 టన్నుల పంచదార పంపిణీ చేస్తున్నారు. కార్డుదారులు తమ పరిధిలోని డిపోలకు వెళ్లి సరకులు తీసుకునేలా ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచే సరకులను పంపిణీ చేసేందుకు గాను రేషన్ డిపోలను అందంగా తీర్చిదిద్దాలని డీలర్లకు ఆదేశాలిచ్చారు. ప్రత్యేకించి డిపో ముందు బోర్డు ఏర్పాటు చేసి డిపో నంబర్, డీలర్ పేరు, ఏరియా పేరు, సర్కిల్ నంబర్, స్టాకు వివరాల మొత్తాన్ని బోర్డులో పొందుపరిచేలా చేశారు. ఒకటో తేదీన ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను పిలిచి కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశించారు. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు రేషన్ డిపోలను తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కర్, జిల్లా పరిశీలకుడు, పౌరసరఫరాలశాఖ డీడీ భగన్నారాయణలు నగరంలోని పలు డిపోలను సందర్శించి డీలర్లకు సూచనలు చేశారు. ప్రతి డిపోలో రికార్డులు, ఈపోస్ మిషన్లు తనిఖీ చేసి అవసరమైన సూచనలు ఇచ్చారు. కేటాయించిన సమయాలను పాటించాలని, తూకంలో తేడాలు వద్దని, ప్రతిఒక్కరికీ ఈపోష్ మిషన్ నుంచి రసీదు ఇవ్వాలని వివరించారు. ప్రతి డిపోలో తాగునీటి సదుపాయం కల్పించాలని, కార్డుదారులకు కూర్చునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సరకుల పంపిణీలో తేడాలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే సరకులు ఇవ్వాలన్న ఆదేశాల మేరకు జిల్లాలో అటువంటివారు 32,701 మంది ఉన్నట్టు గుర్తించారు. సర్కిల్-1లో 8,672 మంది, సర్కిల్-1లో 8,200, సర్కిల్-3లో 7,891, భీమిలి మండలంలో 3,091, పద్మనాభంలో 2,023, ఆనందపురంలో 1,852, పెందుర్తిలో 972 మంది ఉన్నారు. వీరికి ఇళ్ల వద్దు సరకుల పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఆదివారం నుంచి చేపట్టే సరకుల పంపిణీలో ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు జేసీ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లాలో ఎండీయూ ఆపరేటర్లు అందజేసిన ఈ-పోస్ మిషన్లకు పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మరమ్మతులు చేసి డీలర్లకు అందజేస్తున్నారు. కార్డుదారులకు రసీదులు ఇచ్చేందుకు వీలుగా పేపర్ రోల్స్‌ను డీలర్లకు సరఫరా చేశారు.

మసాజ్ సెంటర్లపై సీపీ కన్ను!

(3వ పేజీ తరువాయి)

చేయడాన్ని పోలీసులు అనుమతించరు. మసాజ్ సెంటర్/స్పాలలో పురుషులకు, మహిళలకు వేర్వేరు సెక్షన్లను ఏర్పాటు చేయాలి. లోపలకు ప్రవేశించడానికి ఒక మార్గం, బయటకు వెళ్లేవారికి ఒక మార్గం వేర్వేరుగా ఉండాలి. వారికి టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు కూడా వేర్వేరుగా ఉండడంతో పాటు లోపల ఒక గది నుంచి మరొక గదిలోకి వెళ్లేలా అంతర్గత ద్వారాలు ఉండకూడదు. సెంటర్‌లోకి అడుగుపెట్టిన వారికి ప్రతీదీ కనిపించేలా ఉండే ట్రాన్స్‌ప్రింట్ అద్దాలను మాత్రమే ఏర్పాటు చేయాలి. పదిమంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నట్టయితే వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వడం, మహిళా సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగం వంటివి అందుబాటులో ఉంచాలి. మసాజ్ సెంటర్/స్పాలలో ఫిజియోథెరపిస్టు లేదా ఆక్యుప్రెజర్ లేదా ఆక్యుపేషనల్ థెరపీలో డిగ్రీ, డిప్లొమా లేదంటే సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లను మాత్రమే నియమించుకోవాలి. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే వీటిని తెరిచి ఉంచాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను వీడియో రికార్డు చేసేలా అన్నిచోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు కనీసం మూడు నెలల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్ డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి. కానీ నగరంలోని మసాజ్ సెంటర్/స్పాల్లో మాత్రం ఈ నిబంధనలేవీ మచ్చుకైనా అమలు కావడం లేదనేది నేడి బహిరంగ రహస్యం.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

నగరంలోని మసాజ్ సెంటర్‌లు/స్పాలలో ఒకటి, రెండు మినహా మిగిలిన వాటన్నింటిలోనూ క్రాస్ జెండర్ మసాజ్‌లు, వ్యభిచారం వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. థాయ్‌లాండ్, కేరళ, గోవా వంటి ప్రాంతాల నుంచి యువతులను నగరానికి తెప్పించి వారితో మసాజ్ పేరుతో వ్యభిచారం చేయిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నాళ్ల కిందట నగరంలోని మసాజ్ సెంటర్లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా థాయ్‌లాండ్‌కు చెందిన యువతులు స్పా సెంటర్లలో ఎటువంటి అనుమతి లేకుండా పనిచేస్తున్నట్టు గుర్తించారు. అలాగే కొన్ని సెంటర్లలో వాడిపడేసిన కండోమ్‌లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. సెంటర్లలో పనిచేస్తున్న వారిలో మసాజ్ గురించి అవగాహన లేని యువతులే పనిచేస్తున్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు మసాజ్ సెంటర్ల నిర్వాహకులను పిలిచి ఆయా సెంటర్లకు సంబంధించిన నియమ నిబంధనలు, పాటించాల్సిన జాగ్రత్తలు, ఉల్లంఘించిన వారిపై తీసుకునే చర్యలు, ఎదురయ్యే శిక్షల గురించి వివరించారు. అయి నప్పటికీ వారిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ ఒక్కో మసాజ్ సెంటర్ స్థాయిని బట్టి సగటున రూ.పది వేల చొప్పున నెలనెలా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు చేరిపోతోందని, అందువల్లే చర్యలు ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జంబ్లింగ్ తనిఖీలతో అక్రమాలకు చెక్

మసాజ్ సెంటర్ల నిర్వాహకులతో పలువురు పోలీసులు అవగాహన ఏర్పరుచుకున్నారని సీపీ శంఖబ్రత బాగ్చికి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ఆదేశాలతో సిబ్బంది నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే సమాచారం సీపీకి చేరింది. పోలీసులు మసాజ్ సెంటర్లు/స్పాల నిర్వాహకులతో మిలాఖత్ కావడంతో దాడులు చేసినప్పుడు ముందుగానే వారికి సమాచారం అందజేసి అప్రమత్తం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందువల్లే తనిఖీల సమయంలో పోలీసులు తమకు ఎలాంటి ఉల్లంఘనలు కనిపించలేదని నివేదిక ఇస్తున్నారని సీపీ భావిస్తున్నారు. ఇకపై దీనికి అడ్డుకట్ట వేయాలంటే తరచూ మసాజ్ సెంటర్లు/స్పాలపై దాడులు నిర్వహించాల్సిందేనని భావిస్తున్నారు. అలా దాడులు చేసినప్పుడు ఒక స్టేషన్ పరిధిలోని మసాజ్ సెంటర్‌లు/స్పాలలో తనిఖీలు చేసేందుకు వేరే పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బందికి బాధ్యతలు (జంబ్లింగ్) అప్పగించడం వల్ల అక్రమార్కులు తప్పించుకునే అవకాశం ఉండదని సీపీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ విధానంలో మసాజ్ సెంటర్లు/స్పాలలో తనిఖీలకు శ్రీకారం చుడతామని ఆయన తెలిపారు.

గాజువాకలో భారీ వర్షం



గాజువాకలో కురుస్తున్న వర్షం

గాజువాక, మే 30 (ఆంధ్రజ్యోతి) : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గాజువాకలో ఎండ కాసింది. ఎండ వేడికి ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

సూర్య ఘర్‌తో విద్యుత్ బిల్లు ఆదా

- ఈపీడీసీఎల్ ఏడీసీ అడబాల పార్థసారథి, ఏఈ రామకృష్ణ
- సోలార్ రూఫ్‌టాప్‌లపై ఇంటింటి సర్వేపై వినియోగదారులకు అవగాహన



ఇంటింటికీ సర్వేలో సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఈపీడీసీఎల్ ఏడీసీ ఎ.పార్థసారథి, ఏఈ రామకృష్ణ

ఆటోనగర్,మే 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలంటే విధిగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో పథకంలో చేరాలని సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవాలని ఈపీడీసీఎల్ ఏడీసీ అడబాల పార్థసారథి, ఏఈ రాయుడు రామకృష్ణ సూచించారు. జీవీఎంసీ 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ రామాలయ ప్రాంగణంలో శుక్రవారం సోలార్ రూఫ్ టాప్‌పై ఇంటింటికీ నిర్వహించిన సర్వేల్లో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో 18 మంది వినియోగదారులు రిజస్ట్రేషన్ చేసుకొన్నారు.ఈ సందర్భంగా ఏడీసీ, ఏఈ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కు కరెంటు బిల్లులను తగ్గించడమే కాకుండా, ఇంధన రంగంలో భారత్ స్వావలంబన దిశగా పయనించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోందన్నారు. ఒక కిలోవాట్ వ్యవస్థకు రూ.30 వేలు, ఉత్పత్తి అయ్యే 120 యూనిట్లు, వినియోగదారునకు ప్రస్తుతం రూ.1000 బిల్లు వస్తుంటే సోలార్ ఏర్పాటు తర్వాత రూ.338, ఏడాదికి రూ.8000 వేలు ఆదా అవుతుందన్నారు. 2 కిలోవాట్ల వ్యవస్థకు రూ.60 వేలు, 3 కిలోవాట్ల వ్యవస్థకు రూ.78 వేలు కేంద్రం నుంచి రాయితీ లభిస్తుందన్నారు. టీడీపీ వార్డు సెక్రటరీ కేవీఎస్ శంకరరావు మాట్లాడుతూ పెట్టుబడుల కోసం ఎటువంటి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణం తీసుకొనే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. సౌర విద్యుత్ వలన కలిగే బహుళ ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ విభాగ సిబ్బంది, లైన్‌మెన్లు, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

నిరంకుశ నిర్బంధాలపై ఐక్య పోరాటాలు అవసరం

- సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో సంఘం గౌరవధ్యక్షుడు జె.అయోధ్యరాం



స్టీల్‌ప్లాంట్ వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, యాజమాన్యాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు, నిర్బంధాలపై ఐక్య పోరాటాలు చేయాలని స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భవ దినోత్సవాన్ని శుక్రవారం ప్లాంటు అడ్మిన్ భవనం మార్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ఐక్యతను విచ్ఛిన్నం చేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దీంతో కార్మిక వ్యతిరేక విధానాలను అత్యంత వేగంగ అవలంభిస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు ఎంతటి పోరాటాలకైన సిద్ధమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి.దాసు, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు బి.అప్పారావు, గంగాధర్, రాజు, ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు. గాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, నాయకులు పద్మ, మంగ, అరుణ, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

బెల్ హెచ్‌పీవీపీలో..

అక్కిరెడ్డిపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణతో పాటు కార్మిక సంక్షేమానికి, దేశాభివృద్ధి భాగస్వామ్యమయ్యేది ఒక్క సీఐటీయూ మాత్రమేనని బెల్ హెచ్‌పీవీపీ సీఐటీయూ సీనియర్ నాయకులు సనపల జగన్నాథరావు పేర్కొన్నారు. బెల్ హెచ్‌పీవీపీ మెయిన్‌గేటు ఎదుట శుక్రవారం జరిగిన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో సంఘం పతాకాన్ని జి.చిన్నబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు ఐక్యంగా ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక నేతలు ఎ.లోకేశ్, సీతం నాయుడు, జె.కోటేశ్వరరావు, సీహెచ్ మురళీశ్వరరావు, కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టుకు అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అదానీ గంగవరం పోర్టు ప్రతినిధులు

గాజువాక, మే 30 (ఆంధ్రజ్యోతి) : అదానీ గంగవరం పోర్టుకు 9వ అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డు లభించింది. అపెక్స్ ఇండియా కార్పరేన్స్ ఆన్ ఈఎస్‌జీ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అదానీ గంగవరం పోర్టు ప్రతినిధులు అవార్డు అందుకున్నారు. గాలి, నీటి నాణ్యత నిర్వహణ, వ్యర్థాల తగ్గింపు, రీ-రీసైక్లింగ్, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, ఇంధన సామర్థ్య అంశాల్లో చేపట్టిన చర్యలకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఆటోనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 70వ వార్డు ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన చీకటి లక్ష్మణ్ (56) గురువారం సామాజిక భవనం వద్ద మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేని లక్ష్మణ్ స్థానికంగా తిరుగుతూ ఉండేవాడనీ, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావించిన స్థానికులు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దేనం కొండ కృష్ణంరాజుకుసమాచారం అందించారు. మృతదేహం ఉన్న స్థలానికి ఆయన చేరుకొని శాంతి రథంలో శ్మశాన వాటికకు తీసుకు వెళ్లి, స్థానికుల సహకారాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 'మానవతా' సేవల పట్ల స్థానికులు ప్రశంసించారు.

ఉక్కు నిర్వాసిత కాలనీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటుకు హామీ

- క్షేత్ర పర్యటన జరిపి రూట్‌మ్యాపు పరిశీలించిన ఆర్టీసీ అధికారులు

కూర్మన్నపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు కణితి నుంచి వడ్లపూడి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సదుపాయం కల్పించాలని కోరుతూ గురువారం తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీలుసిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఇదే సమస్యను జనవరి 28న వడ్లపూడిలో జరిగే 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా..పరిష్కారం అజెండాగా' కార్యక్రమంలో తిరుమల నగర్ కాలనీ వాసులు ప్రస్తావించారు. జీవీఎంసీ 87 వార్డులో సుమారు 25 వేల జనాభా ఉన్నారనీ, ఉదయం, సాయంత్రం వేళ పలు బ్యాంకు ఉద్యోగులు, ప్రధాన విద్యుత్ కార్యాలయాల్లో కార్మికులు, పరిశ్రమల్లో సిబ్బంది, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలకార్మికులు, ఆస్పత్రులకు వెళ్లే రోగు లు, స్కూళ్లు, కళాశాలలకు రాకపోక లు సాగించే విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని 'ఆంధ్రజ్యోతి' లో పలుమార్లు వచ్చిన కథనానికి స్పందించిన స్టీలు సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్రీనివాసరావు ఆర్ఎం ఆదేశాలతో శుక్రవారం తిరుమల నగర్, కణితి, వడ్లపూడిలలో పర్యటించి రూట్ మ్యాపులను పరిశీలించారు. అతి కొద్ది రోజుల్లో ఉక్కు నిర్వాశిత కాలనీలకు బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎం వెంట కాలనీ వాసులు బి.నాగభూషణం, జి.విశ్వేశ్వరరావు,ఎం.పరమానందం,సన్యాసిరావు,ఇజ్రాయిల్,పరమేశ్వరరావు, వసంత రెడ్డి, రాజు ఉన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

అగనంపూడి, మే 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు.

అంతర్జాతీయ మోడలింగ్ పోటీలకు ఎంపికైన జెనిషా



అలికన జెనిషా

అక్కిరెడ్డిపాలెం, మే30 (ఆంధ్రజ్యోతి) :షీలానగర్ ప్రాంతానికి చెందిన అలికన జెనిషా (8) అంతర్జాతీయ జూనియర్ మోడల్ పోటీలకు ఎంపికైనట్టు ఆమె తల్లిదండ్రులు రాంబాబు, కావ్య తెలిపారు. బీవీకె పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న జెనిషా మోడలింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. ఇటీవల విశాఖలో జరిగిన ఎంపిక పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23 నుంచి 25 వరకు గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఆమె నైపుణ్యం, ఇంట్రడక్షన్, ఇంటర్వ్యూ, నేషనల్ థీమ్ రౌండ్‌లో అద్భుత ప్రతిభ చూపి క్రౌన్ సాధించింది. ముఖ్యంగా నెమలి రూపంలో దుస్తులు ధరించి నేషనల్ థీమ్‌లో సత్తా చాటి అంతర్జాతీయ మోడలింగ్ పోటీలకు ఎంపికైంది. దీంతో త్వరలో వియత్నాంలో జరగనున్న అంతర్జాతీయ జూనియర్ మోడల్ పోటీలకు ఎంపికక్కైంది. ఈ సందర్భంగా జెనిషాను పలువురు అభినందించారు.

అమోనియ భద్రతపై కోరమాండల్ ప్రత్యేక అవగాహన



అమోనియ అవగాహన కార్యక్రమంలో పాల్గొన కంపెనీల సూపర్‌వైజర్‌లు

మల్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): 'అమోనియ భద్రత - పరిశ్రమ వినియోగదారుల' అనే అవగాహన కార్యక్రమాన్ని అంతర్జాతీయ కోరమాండల్ ఎరువుల కర్మాగారం కంపెనీ, రాష్ట్రప్రభుత్వం సహకారంతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక భద్రతను ప్రోత్సహించడంలో కోరమాండల్ కంపెనీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. అమోనియ వల్ల జరిగే ప్రమాదం నుంచి ఏలా సంరరక్షించుకోవాలనే అంశంపై కంపెనీ అవగాహన కల్పించిన తీరు ఎంతగానో ఆకట్టుందని అన్నారు. పార్మా ఇండస్ట్రీస్, ఆక్వా, ఐస్ ఫ్యాక్టరీస్, సీఫుడ్ ప్రోసెసింగ్, శీతల యూనిట్‌లలో పనిచేస్తున్న 55 మంది ఆపరేటర్స్, సూపర్ వైజర్స్‌కు అమోనియ నిర్వహణలో భద్రత చర్యల గురించి ఉత్తమ పద్ధతుల ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. నియంత్రణ సంస్థలు సహకరించడంతో పారిశ్రామక సమాజానికి ప్రతిభావంతమైన భద్రత కార్యక్రమాలను అమలు చేయడంలో కంపెనీ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొన్నారు. కోరమాండల్ కంపెనీ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ (విశాఖపట్నం యూనిట్ హెడ్) ఎం.జ్ఞానసుందరం, ఈఎస్ఎస్ హెడ్ డి.నాగరాజు, డీసీసీ హెడ్ జేపీ భగత్, అమోనియ ప్లాంట్ సెక్షన్ హెడ్ వి. కిశోర్‌కుమార్, ఈహెచ్ఎస్ సీనియర్ మేనేజర్ ఎన్.లోకేశ్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భైరవం** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం)
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : మెలోడి, కామేశ్వరి, గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 20, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనప కాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)54, బరబాటి 28, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 28, క్యాప్సికమ్ 48,పొట్లకాయ (పెద్ది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కరివేపాకు(కిలో) 35,కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన(కట్ట) 4, చుక్కకూర (కట్ట)4, పాల కూర(కట్ట)4,తోటకూర(కట్ట)4, మామిడి అల్లం56, బొప్పాయి28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

లోతట్టు ప్రాంతాలు జలమయం



గోపాలపట్నం ప్రాంతంలో వర్షం కురుస్తున్న దృశ్యం

గోపాలపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి గోపాలపట్నం దిగువ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం వాతావరణం చల్లబడడంతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు. శుక్రవారం కురిసిన వానకు కొండవాలు ప్రాంతాల్లో ఉన్న గెడ్డలు పొంగిపొర్లాయి. ఇటీవల కురిసిన అడప దడప వర్షాలకు గెడ్డలు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెందుర్తిలో..

భానుడి భగభగలకు శుక్రవారం మధ్యాహ్నం వరకు ఠారెత్తిపోయిన స్థానికులకు సాయంత్రం 4గంటలకు కురిసిన వర్షాలకు ఉపశమం పొందారు. వర్షం కారణంగా గ్రామీణ ప్రాంతంలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగింది. దుక్కి పనులు ప్రారంభించిన వారికి ఈ వర్షం ప్రయోజనమని రైతులు అంటున్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య సహిత నూకాంబిక ఉత్సవాలు

పెదగంట్యాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : పెదనడుపూరులో శనివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీసుబ్రహ్మణ్య సహిత శ్రీనూకాంబికా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరగనున్నాయి. ఆలయ నిర్మాణ, నిర్వహణ అభివృద్ధి కమిటీ ఈ ఉత్సవాలను నిర్వహిస్తోంది. శనివారం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశం, రక్షసూత్రధారణ, అఖండ దీపస్థాపన, యాగశాల విహరణ వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. ఆదివారం ప్రాతఃకాలార్చన, క్షీరాధివాసం, సూర్యనమస్కారాలు, సామూహిక కుంకుమార్చనలు, పంచశయ్యాధివాసం వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. సోమవారం శేష హోమాలు, పూర్ణాహుతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నూకాంబికా అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. శ్రీవిద్యా ఉపాసకులు బ్రహ్మశ్రీ మురపాక వెంకటశశికుమార్ శర్మ, శతాధిక ఆలయ ప్రతిష్ఠాపకులు బ్రహ్మశ్రీ పులఖండం విద్యాసాగర్ శర్మ ఆధ్వర్యంలో ఈ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగనున్నట్టు ఆలయ కమిటీ వెల్లడించింది.

మనమిత్రకు విస్తృత ప్రచారం

పెందుర్తి, మే 30 (ఆంధ్రజ్యోతి): మన మిత్ర పథకం ద్వార జూన్ 12 నాటికి ప్రజలకు 500 రకాల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ పథకంలో సేవలు వేగవంతం చేసేందుకు వాట్సప్ గవర్నెర్స్ గురించి సచివాల సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 15 సచివాలయాల్లో మనమిత్ర పథకం క్యూఆర్ కోడ్లు అందుబాటులో ఉంచి, మనమిత్ర వాట్సప్ నెంబరు 95523 00009ను తెలియజేశారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపను చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 30(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజు నగర్‌లో రూ. 1.90కోట్లతో రహదారి, ఫుట్‌పాత్ అభివృద్ధి పనులకు శుక్రవారం మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జీవీఎంసీలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని ఆయన అన్నారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ గత 10నెలల్లోనే వార్డులో దాదాపు 20కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. త్వరలోనే బీటీరోడ్డు, డివైడర్ల ఆదునీకరణ తదితర పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కే. హైమావతి, ఎస్ఈ కె.శ్రీనివాసరావు, ఈఈ కె.దిలీప్, డీఈ ప్రవీణ్‌కుమార్, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా సమ్మర్ క్యాంపు

ఉక్కుటౌన్‌షిప్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ క్యాంపు విజ్ఞానదాయకంగా ఉండాలని, ఈ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేధిక గాజువాక అధ్యక్షుడు పరుశురాం అన్నారు. స్టీల్‌ప్లాంటులోని వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ సమకాలిన అంశాలపై విద్యార్థులు అవగహన కలిగి పెంపొందించుకోవాలన్నారు. చదువుతో పాటు ఇతర అంశాలపై ప్రావీణ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కె.సుశీల, రమాప్రభ, జాహ్నవి, శైలజ, గుణశంకర్, కుమార్ పాల్గొన్నారు.

తల్లి చెంతకు బిడ్డ

పెందుర్తి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అదృశ్యమైన చిన్నారిని పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. శుక్రవారం సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దొగ్గవానిపాలెంలో ఓ మహిళ తన కుమార్తెతో ఉంటోంది. గురువారం రాత్రి ఆ చిన్నారి ఆడుకుంటుండగా అదృశ్యమైందని తన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు చిన్నారి ఆచూకీ కోసం వెతకగా తన సమీప ఇంటిలోనే ఉందని తెలుసుకుని తల్లికి అప్పగించారు.

13 మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ప్రతిపాదనలు

పెదగంట్యాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 13 మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు మండల విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలను ఆమోదం కోసం జిల్లా విద్యాశాఖాధికార్యాలయానికి పంపారు. ఆమోదం లభించిన వెంటనే ఈ పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా ప్రారంభిస్తామని విద్యాశాఖాధికారులు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలు.. మోడల్ ప్రాథమిక పాఠశాలుగా అప్‌గ్రేడ్ పొందాలంటే.. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కలిపి 55 మందికి పైగా విద్యార్థులు ఉండాలి. అయిదు తరగతి గదులు ఉండాలి. పాఠశాలకు తాగునీరు, మరుగుదొడ్ల సముదాయం, ఇతర వసతులు ఉండాలి. పరిశుభ్రమైన వంటగది ఉండాలి. ఇలా ఉన్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, ఆయా పాఠశాలకు ఉన్న తరగతి గదులు, ఇతర వసతులు వంటి వాటిని పరిశీలించారు.

పెదగంట్యాడ మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 55 మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా అప్‌గేడ్ చేసేందుకు గంగవరం, నెల్లిముక్కు, మదీనాబాగ్, కణితిలనాయుడు పాలెం, సీతానగరం, బాలచెరువు, నడుపూరు, బాపూజీ నగర్, దయాళ్‌నగర్, దిబ్బపాలెం, వియ్యపువానిపాలెం, పెదగంట్యాడ, గొంతెనవానిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో 55 పైగా విద్యార్థులు ఉన్నారు. అలాగే విద్యాశాఖ నిర్ధేశించిన మేరకు తరగతి గదులు, ఇతర వసతులు ఉన్నాయి. ఈ ప్రమాణాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఈ 13 పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు అవకాశం ఉందని, అందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారులుకు మండల విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లా విద్యాశాఖ నుంచి అనుమతి లభిస్తే జూన్ 12 నుంచి ఈ పాఠశాలలన్నీ ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా రూపాంతరం చెందుతాయని మండల విద్యాశాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ తెలిపారు.

దళితుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు

- కాకరలోవలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలియజేస్తున్న డీహెచ్‌పీఎస్ నేతలు

సింధియా, మే 30, (ఆంధ్రజ్యోతి) : దళితుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్‌సింగ్ జంక్షన్‌లో గురువారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దళితులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, విశాఖ జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల పైగా ఉన్న దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 400 యూనిట్లే అమలు చేయడం అన్యాయమని, దళితులకు బడ్జెట్ విషయంలో కూడా అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ఇటీవల దళిత యువకులను తెనాలిలో పోలీసులు నడిరోడ్డుపై కొట్టి అవమానపరచడం చాలా బాధాకరమని, ఈ చర్యకు పాల్పడిన పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు కారకులైన పోలీసులను సస్పెండ్ చేయాలని విశాఖ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా దళిత నాయకులు సాంబమూర్తి, కామేశ్వరరావు, అప్పారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ సంచులు విక్రయిస్తే దుకాణం సీజ్



ప్లాస్టిక్ సంచుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న డి. రవికుమార్ తదితరులు

మల్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో నిషేధిత ప్లాస్టిక్ బ్యాగ్‌లను విక్రయిస్తున్నారు అనే సమాచారంతో 58వ వార్డు శానిటరి ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ పలు దుకాణాలలో శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులకు స్వస్తి పలకాలని, వాటికి ప్రత్యామ్నాయంగా నారతో చేసిన సంచులను వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించినా దుకాణదారులు వినియోగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ప్లాస్టిక్ వినియోగిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

పెందుర్తిరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు పరిధి చింతలఅగ్రహారం బస్‌స్టాండ్ కూడలిలో చేపట్టిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శుక్రవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఇంతక ముందున్న ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని మాత్రం చెక్కు చెదరకుండా భద్రపరిచారు. గాయత్రీ వాస్తు శాస్త్ర పండితులు మల్లిమనుగుల భాస్కరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ



యోగా శిక్షణలో సచివాలయ ఉద్యోగులు

మల్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవీఎంసీ జోన్ 5 ఏపీడీవో కృపానంద పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో అనేక మంది సచివాలయ ఉద్యోగులు శిక్షణ పొందారు. యోగా చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా గురువుల చెప్పారు. ఈ కార్యక్రమంలో 150 మంది సచివాల ఉద్యోగులు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

మల్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం 40, 59, 61, 62, 63 వార్డులో సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సీఐటీయూ పతాకాలను ఆవిష్కరించారు పాటు కేక్‌లను కట్ చేసి పంచుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఐటీయూ కార్మికులు హక్కులకోసం నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

'సంస్థ ప్రగతిలో ప్రతి ఒక్కరిదీ కీలకపాత్ర'

ఉక్కుటౌన్‌షిప్, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌టు ప్రగతిలో ప్రతి ఒక్కరిది కీలకపాత్ర అని ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. విభాగంలో విశేష సేవలు అందిస్తున్న జనరల్ ఫోర్‌మన్ కె.రమేష్‌ను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాంటులోని అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ఒక్క ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం ఉద్యోగులు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో ఉత్పత్తి పెంచేందుకు ఎక్కడ ఎటువంటి సమస్య లేకుండా చేసేందుకు రమేష్ విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంటు అధికారులు సీహెచ్ కనకరాజు, జీవీవీ అన్నపరాజు, ఎం.కె.దుర్గారావు, ఉద్యోగులు యేల్లేటి శ్రీనివాసరావు, ఉప్పిలి రామకృష్ణ, కె.శ్రీరామచంద్రరావు పాల్గొన్నారు.

వర్షాతిరేకాలు

తీవ్రమైన ఎండ.. ఉక్కబోతతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సతమతమైన నగర వాసులు వరుణుడి కరుణతో ఉపశమనం పొందారు. సుమారు గంట నుంచి గంటన్నరపాటు పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన వర్షంలో తడుస్తూనే బాటసారులు ప్రయాణాలు సాగించారు. వేసవి తాపం చల్లారి ఆహ్లాదకర వాతావరణం సంతరించుకోవడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. మరో రెండు, మూడు భారీ వర్షాలు కురిస్తే వేసవి ఎండల తాకిడి నుంచి బయటపడతామని చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం


హెచ్‌బీ కాలనీలో జలమయమైన ప్రధాన రహదారి


తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద వర్షంలో దివ్యాంగుడు


తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద వర్షం


చావులమదుం బ్రిడ్జి వద్ద పాదచారుల పాట్లు


రామకృష్ణ జంక్షన్ వద్ద పొంగిపొర్లుతున్న డ్రైనేజీ


మున్సిపల్ స్టేడియం సమీపంలోని రామకృష్ణ జంక్షన్ వద్ద నిలిచిన నీరు


బీచ్‌రోడ్డు నొవాటెల్ హోటల్ ఎదుట మునిగిపోయిన ఫుట్‌పాత్

క్రైం... crime news

పూజారిగా చేరి.. ఆలయంలో చోరీ

▸ పది ఆలయాల్లో దొంగతనానికి పాల్పడినట్టు నిందితుడి అంగీకారం


వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహనరావు

మహారాణిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్టు ఏడీసీపీ మోహనరావు తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆకోజు బ్రహ్మాజీ (51)కి భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో కలహాల కారణంగా విడిపోయి విశాఖలోని అల్లిపురం వద్ద ఒంటరిగా ఉంటున్నాడు. వన్‌టౌన్‌లో వుడ్‌యార్డు స్ట్రీట్‌లో దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజారి కావాలని నిర్వాహకులు పెట్టిన బోర్డు చూసిన బ్రహ్మాజీ ఈ నెల 19న అక్కడకు వెళ్లి అభ్యర్థించడంతో అతడిని నియమించి, గుడి తలుపుల తాళాలు అప్పగించారు. ఆలయం లోపలకు వెళ్లి పూజకు పూలు, పళ్ళు తెమ్మని బ్రహ్మాజీ కోరాడు. వాటిని తీసుకొచ్చేలోపు అమ్మవారి వెండి కిరీటం, వెండి వస్తువులను తస్కరించి వెళ్లిపోయాడు. దీనితో నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా గురువారం కురుపాం మార్కెట్ వద్ద అతడిని పట్టుకున్నారు. అతని వద్ద ఆలయాల్లో వినియోగించే వివిధ రకాల వెండి వస్తువులు లభ్యమయ్యాయి. వాటి విషయమై పోలీసులు ఆరా తీయగా జిల్లాలోని సుమారు పది ఆలయాల్లో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ క్రమంలో అతని వద్ద నుంచి 2,900 గ్రాముల వెండి, 7.6 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. అతనికి వయసు పైబడటంతో రోజు వారి అవసరాలు తీర్చుకునేందుకు చిన్న చిన్న గుడులను ఎంచుకొని చోరీలకు పాల్పడేవాడు. ఆలయంలో పూజారుల పేర్లు ముందుగా తెలుసుకొని వారితో పరిచయం చేసుకొని గుడిలో ఎవరూలేని సమయంలో దేవుని ఆభరణాలు అపహరించి అమ్మేసి, వచ్చిన ఆ డబ్బుతో కాలక్షేపం చేసేవాడని ఏడీసీపీ వివరించారు.

బైక్‌తో పూలకుండీని ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం

▸ తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై అర్ధరాత్రి ప్రమాదం

▸ నిర్లక్ష్యం..అతివేగమే కారణం


ప్రమాద స్థలంలో విగత జీవులుగా ప్రసన్నకుమార్, సాయికిరణ్

మహారాణిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి కథనం ప్రకారం.. గోపాలపట్నంలోని నరసింహనగర్‌కు చెందిన సవితిని ప్రసన్నకుమార్ (28) అచ్యుతాపురంలోని ఒక ఫార్మా కంపెనీలో కంట్రోల్ ఇంజనీరుగా, సమీప ప్రాంతంలోనే నివాసం ఉంటున్న జక్కంపూడి సాయికిరణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. వీరిద్దరూ గురువారం రాత్రి వైఎంసీఏ బీచ్‌కు వచ్చారు. రాత్రి ఒంటి గంట సమయంలో ఎలక్ట్రిక్ వాహనంపై ఇంటికి పయనమయ్యారు. సాయికిరణ్ వాహనం నడుపుతుండగా, ప్రసన్నకుమార్ వెనుక కూర్చున్నాడు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ పై నిర్మానుష్యంగా ఉండటంతో వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతో అదుపుతప్పి డివైడర్‌పై ఉన్న పూలకుండీని ఢీకొట్టారు. ఇద్దరూ 15 అడుగుల దూరం ఎగిరిపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఘటనా స్థలానికి ట్రాఫిక్ ఎస్‌ఐ చేరుకుని మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అనంతరం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి


నడిరోడ్డుపై జింక మృతి

సాగర్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): అభయారణ్యాలలో సంచరించాల్సిన జింకలు జనారణ్యంలోకి వచ్చి మృతిచెందుతున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున సాగర్‌నగర్ ప్రధాన రహదారిలో ఓ ఐస్ క్రీమ్ పార్లర్ ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి జింక మృతిచెందిన సంఘటన వెలుగు చూసింది. మృతి చెందిన జింకను తొలుత వాకింగ్‌కు వెళ్తున్న సీనియర్ సిటిజన్లు చూశారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వాహనం ఢీకొట్టడంతో జింక మృతిచెంది ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఇటీవల కంబాల కొండ నుంచి తప్పిపోయిన జింకలు జనారణ్యంలోకి వచ్చి కుక్కల దాడిలోనే, వాహనాలు ఢీకొట్టడంతోనే, మరే ఇతర కారణాల వల్లనే జింకలు మృతిచెందడం జంతుప్రేమికులను కలచివేస్తోంది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని జింకలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఐదుశాతం మందికి కరోనా పరీక్షలు

▸ సివియర్ ఎక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ బాధితులందరికీ పరీక్షలు

▸ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో టెస్టింగ్ కిట్లు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. పరీక్షల నిర్వహణకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. జ్వరం, జలుబు, దగ్గు తదితర సాధారణ లక్షణాలతో బాధపడే వారిలో ఐదుశాతం మందికి పరీక్షలు నిర్వహించాలని సూచించింది. అలాగే తీవ్రమైన శ్వాస ఇబ్బందుల (సివియర్ ఎక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్)తో బాధపడే ప్రతి ఒక్కరికీ కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నవారిలో ఆయాసం, దగ్గు, కఫం పడడం వంటి లక్షణాలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఈ లక్షణాలతో బాధపడే ప్రతి ఒక్కరూ కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరీక్షలు నిర్వహించేందుకు అనుగుణంగా కిట్లు పంపిణీ చేశారు. ప్రతి కేంద్రానికి పది చొప్పున కిట్లు పంపారు. కొద్దిరోజుల కిందట పాజిటివ్‌గా నిర్ధారణ అయిన మహిళకు సంబంధించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు అధికారులు పంపించారు. ఇందులో ఒమిక్రాన్ వేరియంట్‌గా తేలినట్టు చెబుతున్నారు. అయితే, తక్కువ స్థాయిలో వైరస్ మోతాదు ఉన్నట్టు తేలిందని చెబుతున్నారు.

ఆందోళన వద్దు..

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో పెద్దగా కేసులు కూడా నమోదు కాలేదని, అయితే ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటించడం మంచిదన్నారు. కొవిడ్ తరహా లక్షణాలతో బాధపడే వారు మాత్రం స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని చూపవద్దన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారిలో కరోనా తరహా లక్షణాలు ఉంటే మాత్రం వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సముద్ర కార్యకలాపాలకు కేంద్రంగా షిప్‌యార్డు

▸ నౌక మరమ్మతులలో దూసుకెళ్తున్న షిప్‌యార్డు షిప్ రిపేర్స్ విభాగం


షిప్‌యార్డు షిప్ రిపేర్స్ విభాగంలో నౌకలకు మరమ్మతులు

మల్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) జూన్ 21కి 85 వసంతాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా షిప్‌యార్డు సాధించిన విజయాలపై సంస్థ యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా షిప్ రిపేర్ కాంప్లెక్స్ (డ్రైడాక్) సాధిస్తున్న విజయాలను తెలియజేయడంతో పాటు ప్రస్తుతం ఆ విభాగంలో జరుగుతున్న నౌక మరమ్మతుల గురించి తెలియజేశారు. డ్రైడాక్ విభాగం ప్రస్తుతం సముద్ర కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని షిప్‌యార్డు యాజమాన్యం తెలియజేసింది. ఒకప్పుడు నౌకా నిర్మాణాలకు కేంద్రంగా ఉన్న షిప్‌యార్డు కాలక్రమేణా షిప్ రిపేర్ కాంప్లెక్స్‌ను కూడా ప్రారంభించి అనేక నౌకలను విజయవంతంగా మరమ్మతు చేసింది. ప్రస్తుతం డ్రైడాక్ విభాగంలో ఐసీజీఎస్ సారంగ్, ఎస్‌సీఐ సబర్మతి, ఎంవీ తరంగిణితో నౌకల మరమ్మతులు జరుగుతున్నాయి. ఇది హెచ్‌ఎస్‌ఎల్ బహుముఖ సామర్థ్యాలకు పెరుగుతున్న ప్రొఫైల్ అని వారు పేర్కొన్నారు. వచ్చే నెలలో ఐఎన్‌ఎస్ జమునా, ఆర్‌వీసాగర్ కన్య, ఎంఎఫ్‌వీ సముద్రిక నౌకల కోసం డ్రైడాకింగ్‌లో షెడ్యూల్ సిద్ధం చేశారు.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు


డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలతో నేవీ అధికారులు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు ఈ నెల 23 నుంచి వారం రోజుల పాటు తూర్పు నావికాదళంలోని వివిధ విభాగాలు సందర్శించారు. ఈ సందర్భంగానే తూర్పు నావికాదళం అధికారులతో డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు అర్థవంతమైన చర్చలు జరిపారు. రీసెర్చ్ అండ్ ఆపరేషనల్ విధానాలపై చర్చించారు. భారత నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ నావికాదళం ఆపరేషన్ విధానాలను వివరించారు. తూర్పునావికాదళానికి సంబంధించిన ఐఎన్‌ఎస్ శాతవాహన, ఐఎన్‌ఎస్ కళింగ, షిప్‌లను, వాటి ట్రైనింగ్ యూనిట్లను డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు సందర్శించారు.ఈఎన్‌సీ సందర్శన ముగింపు సందర్భంగా గురువారం చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ శాస్త్రవేత్తలకు సర్టిఫికేట్లు అందజేశారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో ముగ్గురి అరెస్టు

ఎండాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో ముగ్గురు బుక్కీలను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. గాజువాకలో ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరిని ఇప్పటికే అరెస్టు చేయగా, అదే కేసులో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం ఇప్పలవలసకు చెందిన పెనుమజ్జి శ్రీనివాసరావు(45),గరివిడి మండలం రేగటి అగ్రహారానికి చెందిన మోదుల అరవింద్ (26)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో బెట్టింగ్ కేసులో అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, రాయిపోడుకు చెందిన ఆడాది సురేష్ (34)అనే ప్రధాన ముద్దాయిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్‌ఫోరంలో 16 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకర్

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్‌ఫోరంలో 16 వినతులు అందినట్టు చీఫ్‌సిటీప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా అందుతున్నందున ప్రతీ శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్‌ఫోరం పేరుతో ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నామన్నారు. తాజాగా అందిన ఫిర్యాదుల్లో ఒకటి, రెండు, మూడు జోన్లకు సంబంధించి ఒక్కొక్కటి, నాలుగు, ఏడు జోన్లకు రెండేసి, ఐదో జోన్‌కు సంబంధించి తొమ్మిది ఫిర్యాదులు అందాయన్నారు.





